ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

గురువారం, డిసెంబర్ 18, 2014,

ఇరవై రెండో సమావేశం, సంపుటం-1, నంబరు-1,

జయనామ సంవత్సరం, మార్గశిరం-11.

**THURSDAY, THE 18TH DAY OF DECEMBER, 2014,**

**TWENTY SECOND SESSION, VOLUME - 1, NO.1,**

**11TH MARGASIRAM, 1936 S.E.**

*****

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

**ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు**

**గురువారం, డిసెంబర్ 18, 2014.**

# అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) సభా కార్యక్రమం – పాకిస్థాన్‌లో జరిగిన కాల్పులలో చనిపోయిన వారి మృతిపట్ల సంతాప తీర్మానం

(2) నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

(3) సభా కార్యక్రమం –ప్యానెల్ ఛైర్మన్ల నియామకంపై ప్రకటన

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**
**THURSDAY, THE 18TH DAY OF DECEMBER, 2014**
(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

(జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభమైంది.)

MR. CHAIRMAN: Now, Question Hour.

## సభా కార్యక్రమం

## పాకిస్థాన్‌లో జరిగిన కాల్పులలో చనిపోయిన వారి మృతిపట్ల సంతాప తీర్మానం

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, పాకిస్థాన్‌లో మొన్న జరిగిన విషాద సంఘటనలో సుమారు 150 మంది పసిపిల్లల మారణకాండ, నిన్ననే ఇరాన్‌లో మహిళలపై జరిగిన మారణకాండ గురించి ఈ సభలో తీర్మానం ప్రవేశపెట్టవలసిన అవసరముందని, సంతాపం కూడా తెలియజేయవలసిన అవసరముందని మేము భావిస్తున్నాను. ముందుగా ఈ అంశాన్ని తీసుకుని ఆ తరువాత ప్రశ్నోత్తరాలను తీసుకుందాము.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు): అధ్యక్షా, పెషావర్‌లో చిన్నపిల్లలపై జరిగిన సంఘటన చాలా బాధాకరమైన సంఘటన. పార్లమెంటు కూడా ఈ సంఘటనపై సంతాప తీర్మానం చేసినట్లుంది. ఈ సభలో మనం కూడా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని నేను కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులునాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం): అధ్యక్షా, అభం శుభం తెలియని పసిపిల్లలపై జరిగిన ఈ సంఘటనను మనమంతా ఏకగ్రీవంగా ఖండించాలి. సుమారు 140 మంది చిన్నారులను ఉగ్రవాదులు బలితీసుకున్నారు. హింస ఏ దేశంలో జరిగినా తప్పకుండా దానిని ఖండించవలసిన బాధ్యత సభపై ఉంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: (మైకు లేకుండా) మన భారతదేశంలో కూడా ఇటువంటి సంఘటనలు జరగవచ్చనే వార్తలొచ్చాయి. ఇది చాలా ఆందోళనకరమైన అంశం మరియు ప్రతి పౌరుడు మానసికంగా ఎంతో క్షోభకు గురయ్యారు కాబట్టి తప్పనిసరిగా ఈ సభలో ఈ అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి.

శ్రీ సి.రామచంద్రయ్య (అసెంబ్లీ నియోజకవర్గం): అధ్యక్షా, ఈ అంశాన్ని తప్పకుండా టేకప్ చేద్దాము. ఎందుకంటే, యావత్ ప్రపంచాన్ని ఈ సంఘటన చాలా ఆందోళన కలిగించింది. ఇది చాలా దారుణం. దీనిపై చర్చ జరిగితే సభ్యులు కూడా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశముంటుంది. ఈ అంశాన్ని సభలో తప్పకుండా టేకప్ చేద్దాము.

శ్రీ ఎం.వి.యస్.శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం): అధ్యక్షా, ఇది చాలా సీరియస్ అంశం. దీని ఇంప్లికేషన్స్ మనదేశంపై కూడా ఉంటాయి. తప్పనిసరిగా దీనిపై సభలో తీర్మానం చేయాలని నేను అభిప్రాయపడుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రిగారూ, ఈ అంశంపై చీఫ్ విప్‌గారు, ఫ్లోర్ లీడర్ల అభిప్రాయం జనరల్‌గా ఉంది. క్వశ్చన్ అవర్ అయిన తర్వాత ఎలాగూ బిజినెస్ లేదు కాబట్టి 11 గంటలకు క్వశ్చన్ అవర్‌ను పూర్తిచేసుకుని ఆ తర్వాత ఈ అంశంపై సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని నేను అనుకుంటున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు: అధ్యక్షా, ఈ అంశం చాలా సీరియస్ అంశం, దీని గురించి సభ్యులంతా అడుగుతున్నారు కాబట్టి ఈ అంశాన్ని ముందుగా చేపట్టి ఆ తరువాత క్వశ్చన్ అవర్‌ను టేకప్ చేద్దాము.

శ్రీ ఎస్. చినరాజప్ప: అధ్యక్షా, ఈ సంతాప తీర్మానం అంశాన్ని క్వశ్చన్ అవర్ కంటే ముందుగానే టేకప్ చేద్దాము.

మిస్టర్ ఛైర్మన్: ఈ అంశంపై అందరూ మాట్లాడాలంటే చాలా ఆలస్యమవుతుంది. దీనిని ఫ్లోర్ లీడర్లతో ప్రారంభిద్దాము. ఈ సంఘటనను తీవ్రంగా ఖండిద్దామనే చెబుతాము. అందరి అభిప్రాయం అదే కదా! మన సంతాపాన్ని వెలిబుచ్చుతాము కాబట్టి సమయాన్ని ఆదా చేయడం కోసం మనమంతా ఏకగ్రీవంగా చెబుదాము. పెషావర్‌లో జరిగిన విషాద సంఘటనపై ఉగ్రవాదాన్ని ఖండిస్తూ ఇప్పుడు సభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడదాము.

ఉ.10.10

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, ప్రపంచంలోని ఏదో ఒక దేశంలో అక్కడక్కడ ఒక రిద్దరు లేదా పది మంది ఉగ్రవాద దాడుల్లో మరణించడం జరుగుతుండేది. కానీ మూకుమ్మడిగా అమాయకులైన పసిబిడ్డల మీద కళ్లల్లో, చేతులు కాళ్లు, గుండెల్లో, మెదడులో తూటాలు పేల్చి వందల మంది బిడ్డలను పొట్టన పెట్టుకోవడమనేది ఎవరూ సహించలేని చర్య. పైగా మేమే ఈ చర్యను చేశామని తాలిబాన్లు చెప్పుకోవడమనేది అంతకన్నా ఘోరమైన విషయం. ఈ సంఘటనతో ప్రపంచం ఉలిక్కిపడింది. మన భారతదేశంలో ప్రధానమంత్రి మోడీ గారితో సహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ విషయాన్ని ముక్త కంఠంతో ఖండించారు. అంతేకాకుండా అటు పార్లమెంటులోని లోక్‌సభ, రాజ్యసభలు కూడా ఇందుకు సంతాపం తెలియజేశారు. ఈ రోజు మీరు సంతాప తీర్మానం ప్రవేశపెడుతున్నందుకు, సంతాపం తెలియజేయడానికి ముందుగా నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కానీ దురదృష్టకర పరిస్థితి ఏమిటంటే – ఎంతోమంది తలిదండ్రులు తమ బిడ్డలను నవ మాసాలు మోసి కని, పెంచి చదువుకొని వృద్ధిలోకి వస్తారనుకున్న బడ్డలు ఆ విధంగా చనిపోతే, పేపర్లలో, టి.విల్లో చూశాం, ఆ దృశ్యాలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఈ రోజు కూడా ఇరాక్‌లో 140 మంది మహిళలను పొట్టన పెట్టుకున్నారన్న వార్తలొచ్చాయి, అందులో పిల్లలు కూడా ఎక్కువమంది ఉన్నారన్నారు, అదే విధంగా

పాకిస్తాన్‌లో కూడా అనేకమంది పిల్లలు చావు బ్రతులకు మధ్య ఉన్నారన్నారంటున్నారు, చాలా భయానక వాతావరణం కనిపిస్తుందంటున్నారు. ఒక పాఠశాలలోని ఒక తరగతికి చెందిన విద్యార్థుల్లో కేవలం ఒక విద్యార్థి మాత్రమే బ్రతికి మిగిలిన విద్యార్థులంతా మరణించారని చెపుతున్నారు. ఆ పిల్లవాడు కొవ్వొత్తి వెలిగిస్తూ తల్లడిల్లిపోతున్న తన స్థితిని టి.విల్లో ఫోటోలో చూచినప్పుడు మనం ఏ విధంగా స్పందించామో ఒక్కసారి ఆలోచించాలి.

ప్రపంచ దేశాలన్నీ ఒక సమావేశం ఏర్పాటు చేసుకొని అత్యవసరంగా ఇటువంటి వాతావరణం లేకుండా చేయాల్సిన బాధ్యత ఉంది. ఎందుకంటే, భారతదేశంలో ఎక్కడైనా ఉగ్రవాద దాడులు జరగొచ్చని హెచ్చరికలు వస్తున్నాయి. దీన్ని బట్టి మనకు ఉగ్రవాదం ముప్పు పొంచి ఉందని చెప్పొచ్చు. కాబట్టి ప్రజలకు భద్రత కల్పించాల్సిన అవసరం అన్ని చోట్ల ఉంది. ఒక దేశంపై పగ ఉన్నప్పుడు సరిహద్దుల్లో దాడులు చేయడం, యుద్ధం ప్రకటించడం చేస్తారు కానీ, ఈ విధంగా పాఠశాలలపైకి వచ్చి బిడ్డలను హతమారుస్తే ఆ తల్లిదండ్రుల యొక్క మానసిక స్థితి ఏవిధంగా ఉంటుంది, ఆ పిల్లలతో పాటు ఉండి బ్రతికి బయటపడ్డ వారి మానసికి స్థితి ఏవిధంగా ఉంటుంది, అదేవిధంగా ప్రశాంతంగా చదువుకుంటున్న విద్యార్థులు పత్రికల్లో, టి.విల్లో జరిగిన సంఘటనలు చూసినపుడు వారి మానసిక స్థితి ఏవిధంగా ఉంటుంది, తలిదండ్రుల ఆందోళన ఏవిధంగా ఉంటుంది? ప్రస్తుతం చట్ట సభల్లో కూడా మన ఆందోళన ఆ విధంగానే ఉంది. నేను ఒకటే ప్రార్థిస్తున్నాను – దయచేసి అన్ని దేశాల పెద్దలందరూ కలిసి ఐక్యరాజ్యసమితి లాగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఒక తీర్మానం చేయడమే కాకుండా, ఇటువంటి సంక్షోభాలకు తెరతీసే సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించి భద్రత కల్పించేందుకు, ప్రజలకు భరోసా ఇచ్చేందుకు అందరూ ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. నిజానికి గుండె పగిలిపోతోంది, ఏ దేశమైనా, ఏ మతమైనా కావచ్చు, మనకు వారి పట్ల కొంత ఇష్టం, కొంత అయిష్టత ఉండొచ్చు, కానీ ప్రాణం ఒక్కటే, మానవత్వం అనేది ఒక్కటే, మనమంతా మానవులం కాబట్టి మానవులుగా మనం స్పందించాల్సిన అవసరం ఉంది. ఆ కుటుంబాలకు ప్రగాఢమైన సానుభూతిని ప్రకటించడమే కాకుండా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని, అల్లాని, క్రీస్తును, ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని చేతులెత్తి ప్రార్థిస్తున్నాను. ఆ బిడ్డల తలిదండ్రులకు మనోధైర్యాన్ని కలిగించే శక్తిని కూడా ఆ భగవంతుడే ప్రసాదించాలి. కొంతమంది కుటుంబాల్లో పిల్లలందరూ చనిపోయారని చెపుతున్నారు. కళ్లు, కాళ్లు పోయి, మెదడు దెబ్బతిని ఒక అచేతన స్థితిలోకి వెళ్లారని కూడా చెపుతున్నారు, ఇది నిజంగా హృదయ విదారకమైన దృశ్యం, ఇందుకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, ఇంతకుమునుపు క్రాస్ బార్డర్ టెర్రరిజం ఉండేది. దానికి మించి ప్రపంచంలో ఫండమెంటలిజమనేది చాలా వికృతంగా పెరిగిపోతోంది. Sir, any religious fundamentalism is posing a danger to the world peace – whether it is Islam or Christianity or whatever it is, a religious fundamentalism is posing a danger to the world peace – whether it is Islam or Christianity or whatever it is. ప్రస్తుతం ఉగ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో అగ్రరాజ్యాలు చాలా సెలెక్టివ్‌గా ఉన్నాయి. ఒక అవకాశం వచ్చినప్పుడు నేను అమెరికా అంబాసిడర్‌ను అడిగాను – "మీరు ఉగ్రవాదాన్ని నిర్మూలించడమనే విషయాన్ని సెలెక్టివ్‌గా చేస్తున్నారా, లేదా గ్లోబల్ స్థాయిలో చేస్తున్నారా" అని. ఈ అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు వాళ్లు ప్రోత్సహించిన అసాంఘిక శక్తుల వల్లనే ఇటువంటి పరిణామాలు దారి తీస్తున్నాయి. ఇది చాలా దారుణం. ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో ఉండే పురాతన

నగరం పెషావర్. "మా కేడర్‌ను ఏ విధంగా మీరు చంపారో, మీ పిల్లలను కూడా మేము చంపితే మీరు ఏ విధంగా బాధపడతారో చూడాలనే ఉద్దేశ్యంతో చంపామని" తాలిబన్లు క్లెయిమ్ చేశారు. పాఠశాలలో ఉండే విద్యార్థులను చాలా దారుణంగా చంపడం జరిగింది. 148 మంది చనిపోవడమనేది ఒక సంఘటన కావచ్చు, కానీ దీని రామిఫికేషన్స్ మాత్రము చాలా దారుణంగా ఉంటాయి. Any fundamentalism of any religion is a danger to the world peace, including Hinduism. ఈ విషయమై నిన్న పార్లమెంటులో తీర్మానం పాస్ చేయడం జరిగింది, కానీ దురదృష్టం ఏమిటంటే, పై కోణాన్ని వాళ్లు పరిగణనలోనికి తీసుకోలేదు. ప్రస్తుతం భారతదేశంలో పొలిటికల్ పోలరైజేషన్ రిలీజియస్ లైన్స్‌లో జరుగుతుందనడానికి అనుమానమే లేదు. ఇటువంటి అసాంఘిక శక్తులను మరలా ఈ దేశంలో ప్రోత్సహిస్తున్నారు. దీని పరిణామాలు చాలా భయంకరంగా రాబోతాయి. అధికారంలోకి పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి, కానీ సంఘాన్ని ఈ విధంగా విభజన చేసే డివిజివ్ ఫోర్సెస్ ఈ దేశంలో తలెత్తుతున్నాయి. ఏ దేశంలోని ఏ మతమైనా మత ఛాందసమనేది ప్రపంచ శాంతికి విఘాతమనే విషయాన్ని తీర్మానంలో పెట్టాలని కోరుతున్నాను. ప్రస్తుతం భారతదేశంలో జరిగే సంఘటనలు చూస్తుంటే మనం ఎక్కడికి వెళుతున్నాం అని ఒక సారి అందరం ఆలోచించాల్సిన అవసరం ఉంది. చర్చిలను తగలబెడుతున్నారు, బలవంతపు మార్పిడులను జస్టిఫై చేసే మేధావులు, నాయకులు, ఇంతకు ముందు కన్వర్షన్ చేశారు, ఇప్పుడు రీ-కన్వర్షన్ చేస్తే తప్పా అని అడుగుతున్నారు. 300 సంవత్సరాల క్రితం జరిగిన మార్పిడులను మరమ్మత్తు చేసే ఆలోచన ఉండే నాయకులు ఈ దేశాన్ని పరిపాలిస్తున్నారు. కాబట్టి ఆ తీర్మానంలో ఈ అంశాన్ని కూడా చేర్చాలని నేను కోరుతున్నాను. ఇది మత ఛాందసమనేది తప్ప మరొకటి కాదు. It is purely Islamic fundamentalism, which has posed a danger to the world peace. మనం చరిత్రలోకి వెళితే క్రిస్టియానిటీకి, ఇస్లాంకు మధ్య జరిగినవే క్రూసేడులు. అవి ఇంతకు ముందు జరిగాయి. కాలక్రమేణా కొంతవరకు అవి తగ్గాయి, కానీ మరలా ఇప్పుడు విపరీతంగా అమీబా, హైడ్రా పెంటకల్స్ వ్యాపిస్తున్నట్లు వ్యాపిస్తున్నాయి. కాబట్టి ఈ అంశాన్ని కూడా తీర్మానంలో చేర్చాలి, ఎటువంటి మత ఛాందసమైనా ప్రపంచానికి మంచిది కాదు. ఈ విషయమై చాలా ఫోర్సుబుల్‌గా తీర్మానం చేసి పంపించాల్సిన అవసరం ఉంది. ఈ సంఘటనతో ప్రపంచమంతా ఒక పెద్ద షాక్‌లో పడింది. పాకిస్తాన్ ఆర్మీని ఎందుకు నియంత్రించడంలేదని మనం అమెరికా అగ్రరాజ్యాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. పాకిస్తాన్‌కు లోన్ రూపంలో ఇచ్చిన దాదాపు 900 మిలియన్ డాలర్ల ఋణాన్ని అమెరికా రైటాఫ్ చేసిన విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను, knowing that has been spent for military purpose. పాకిస్తాన్‌కు ఇచ్చిన సహాయాన్ని మిటలరీకి సంబంధించిన హార్డ్‌వేర్ మొదలైన వాటికి ఖర్చు చేశారని తెలినా, అమెరికా దాన్ని రైటాఫ్ చేసింది. కాబట్టి అగ్రరాజ్యాలు కూడా అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. దాన్ని కూడా అప్పీలు చేయాల్సిన అవసరం ఉంది. అమెరికా రాజ్యం సెలెక్టివ్‌గా కాకుండా, గ్లోబల్ లెవెల్‌లో హోలిస్టిక్‌గా ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి చర్యలు తీసుకునే ప్రయత్నం చేయాలనే అంశాన్ని కూడా తీర్మానంలో చేర్చాలని కోరుకుంటూ, ఆ కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అసలు వాళ్లుపడే బాధల ముందు మనం తెలిపే సానుభూతులేమి పనిచేస్తాయి? సోదరి శ్రీమతి నన్నపనేని రాజకుమారి గారు చెప్పినట్లు ఒక కుటుంబానికి చెందిన పిల్లలందరినీ దారుణంగా చంపేశారు. ఉగ్రవాదులు ఇంత వికృతంగా ప్రవర్తిస్తుంటే మనం ఎటువైపు వెళుతున్నాం? I pray the Almighty that such an atmosphere should not prevail in this country. Thank you Sir.

ఉ 10.20

శ్రీ పి.జె.చంద్రశేఖర్ రావు (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, పెషావర్‌లోని సైనిక పాఠశాలలో 150 మందికి పైగా పిల్లలు అత్యంత కిరాతకంగా, ఘాతుకమైనటువంటి చర్యలలో బలి కావడాన్ని మనందరమూ తీవ్రంగా ఖండించి, సంతాపం వ్యక్తపరచడమే కాదు దీనికి సంబంధించిన కార్యకారణ సంబంధాలు, పూర్వాపరాలు తిరిగి పునరావృతం కాకుండా జాతీయ, అంతర్జాతీయంగా స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి తప్పనిసరిగా చర్చించి పరిష్కారమార్గాలు సూచించడమనేది నేటి తక్షణ ఆవశ్యకత అని నేను అభిప్రాయపడుతున్నాను. మతానికి, మతోన్మాదానికి, తీవ్రవాదానికి సామ్రాజ్యవాదంతో ఉన్న అవినాభావమైన, పరస్పర ఆధారభూతమైన సంబంధాన్ని మన దేశంలోని ప్రజలు, ప్రపంచం వ్యాప్తంగా ఉన్న ప్రజలు అర్థం చేసుకొని దీనిని పునాదులనుంచి పెకిలించడానికి సత్వరమే చర్యలు చేపట్టాల్సిన అవసరముందని మనవి చేస్తున్నాను.

20 సంవత్సరాల క్రితం ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ సైన్యాలను తిప్పికొట్టాలనే ఉద్దేశంతో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ తదితర దేశాలలో జిహాదీలకు శిక్షణను, ఆయుధాలను, డబ్బులను అందచేసి ఈ కార్యక్రమానికి ఊతమిచ్చినటువంటి సామ్రాజ్యవాదం అమెరికన్ సామ్రాజ్యవాదం. ఈరోజున ప్రపంచంలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా మేము మొనగాళ్ళమని ప్రకటించుకున్నటువంటి అమెరికన్ సామ్రాజ్యవాదం జిహాదీల పేరుతోటి తీవ్రవాదాన్ని పెంచి పోషించి డబ్బులిచ్చి ఉసిగొల్పి చేసినటువంటి బ్యాక్‌గ్రౌండ్‌లో, అది జిహాదీలైనా, మతోన్మాదమైనా వాళ్ళని చూసుకోవాల్సిన అవసరమున్నది.

ఈ సందర్భంగా ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకురాదలచుకున్నాను. చంపడం, చంపబడడం అనేటటువంటిది మనుష్యులకు సంబంధించినటువంటి వ్యవహారం కాదు. ఇదంతా కూడా రాజువు కాబట్టి నువ్వు యుద్ధం చేయాల్సిందే, మనుష్యులను చంపాల్సిందే అని, నువ్వు సైనికుడివి కాబట్టి నీకిచ్చినటువంటి ఆదేశాల ప్రకారంగా నువ్వు కనబడిన శత్రువులందర్నీ పిల్లా, జెల్లాతోటి సంబంధం లేకుండా నీ గురువైనా, తమ్ముడైనా, చర్మ సంబంధమైనవాడైనా సరే చంపడమే నీ కర్తవ్యమని బోధించేటటువంటి గ్రంథాలు, సంస్కారం, ఆకారం, స్వరూపం, ఆయుధమే అలంకారంగా ఉన్నటువంటి ఒక రకమైన తీవ్రవాదపు మనస్తత్వాన్ని పెంచి పోషించే మతోన్మాద పోకడల్ని మనం చిన్నప్పటి నుంచి పిల్లలకు నేర్పించే ఈ వ్యవస్థలో తగిన మార్పులకు శ్రీకారం చుట్టాలి.

అలాగే పెద్దలు రామచంద్రయ్యగారు చెప్పినట్లుగా దీనిని కేవలం మతానికి సంబంధించిన విషయమే కాదు దీని వెనకున్న రాజకీయాలు, యుద్ధోన్మాదం, ఆయుధపోటీ, సామ్రాజ్యవాదపు మూలాలన్నీ కూడా చాలా బలంగా ఉన్నాయి కాబట్టి విస్తృతమైన ప్రజాభిప్రాయాన్ని ప్రోది చేయడంలోనూ, మతోన్మాదాన్ని నియంత్రించడంలోనూ మనం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వివిధ స్థాయిల్లో ఉండే ప్రభుత్వాలకు ఉన్నది. మన రాష్ట్రంలో ప్రత్యేకించి విద్యార్థులు, పాఠశాలలు, వల్నరబుల్ సెక్షన్స్ యొక్క భద్రతని కాపాడడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

ఇక రెండవ విషయం, పెళ్ళి చేసుకోడానికి మహిళలు నిరాకరించారని ఇరాక్‌లో ఐ.యస్ దుర్మార్గులు వాళ్ళందర్నీ లైనులో నిలబెట్టి అందులోనూ పిల్లలూ, గర్భిణీ స్త్రీలను కూడా కాల్చి వేయడమంటే మానవత్వం యొక్క విలువ ఎంత అధమస్థాయికి దిగజారిందో తలుచుకుంటే మనుష్యులుగా పుట్టినందుకు మనకు మనమే సిగ్గుపడాల్సిన స్థాయికి ఈ పరిస్థితులు డెవలప్ కావడం జరిగింది. వీటిని పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ, క్షేత్రస్థాయిలోనూ కూడా తీసుకోవడానికి ప్రభుత్వాలు పూనుకోవాలి. అలాగే రాజకీయ పార్టీలు, మేధావి వర్గాలు ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా ఆలోచించి వీటిని నివారించడమే వారికి సరైనటువంటి నివాళి అర్పించినట్లవుతుందని నా తరఫున, మా పార్టీ తరఫున వారి కుటుంబాలకు సానుభూతి వ్యక్తపరుస్తున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ ః అధ్యక్షా, మొన్న పెషావర్‌లో కానీ, ఇటీవలనే బయటపడిన ఇరాక్ సంఘటన కానీ, రెండు రోజులముందు ఆస్ట్రేలియాలో ఒక హోటల్‌ను చుట్టుముట్టి అక్కడ ఉగ్రవాదులు జరిపిన చర్యలు కానీ ఇది మానవత్వానికీ, దానవత్వానికీ మధ్య జరిగే పోరాటంగా చూడాలని నేను భావిస్తున్నాను. మతానికి సంబంధించిన అంశంగా వాళ్ళు చెప్పడానికి ప్రయత్నించడమే దుర్మార్గమని నేను అభిప్రాయపడుతున్నాను. ఇస్లామిక్ ఉగ్రవాదం పెషావర్‌లో బలి తీసుకున్నటువంటి పిల్లలు ఎవరు? పిల్లలంటే దేముడితో సమానం. 140, 150 మంది దేవుళ్ళని కిరాతకంగా కాల్చి చంపడపమేగాక దానికి మతం పేరు పెడితే అటువంటి దానిని మనం ఏ మాత్రం ఆమోదించకూడదు.

علامہ اقبال کی نظم ہے:

مذہب نہیں سکھاتا آپس میں بیر رکھنا!

అని ప్రముఖ కవి ఇక్బాల్ చెప్పారు. ఇంకొకళ్ళని ద్వేషించమని ఏ మతమూ కూడా చెప్పలేదు. కానీ ఆ మతం పేరు చెప్పి ఇతరుల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టడమనేదాన్నే మనం మతోన్మాదంగా అభివర్ణించాలి. అటువంటి ద్వేషాన్ని రెచ్చగొట్టేటటువంటి ధోరణుల్ని మన రాజ్యాంగం కూడా ఎక్కడా కూడా అనుమతించలేదు. అంతేగాక ప్రపంచంలోని ఏ నాగరిక దేశంకూడా దీన్ని అనుమతించలేదు. అయినప్పటికీ ఇది విచ్చలవిడిగా పేట్రేగిపోవడమనేది ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో చూస్తున్నాం. మన దేశంలో కూడా అటువంటి సంఘటనలు జరిగాయి. రైలు పెట్టెలో ప్రయాణికులుండగా సజీవంగా తగలపెట్టడం, బెస్ట్ బేకరీ సంఘటనల వంటి వాటిలోనూ, గర్భిణీ స్త్రీలను మండుతున్న నిప్పుల్లో వేసి సజీవంగా తగలబెట్టడమం ఇలాంటివన్నీ మతానికి, ఒక ఆచారానికి, సాంప్రదాయానికి సంబంధించింది కాదు. వాటన్నింటికీ పూర్తి వ్యతిరేకమైనటువంటిది. ఇది పూర్తిగా దానవత్వానికి సంబంధించిన అంశాలు.

మనం గమనించాల్సిన ఇంకొక అంశమేమంటే వాళ్ళు ఏ మతం పేరు చెప్పుకుని వచ్చారో, ఆ మతానికి చెందినవాళ్ళనే వాళ్ళు బలి తీసుకుంటున్నారు. కాబట్టి ఒక మతం మీద గౌరవమున్నవాళ్ళు మతోన్మాదంపట్ల మెతగ్గా ఉండడమంటే ఆ మతానికే వాళ్ళు హాని చేస్తున్నారనే విషయాన్ని మనం గమనించాలి. మనదేశంలో జరుగుతున్న చర్చలు రామచంద్రయ్యగారు చాలా క్లియర్‌గా చెప్పారు. పార్లమెంట్‌లో ముందుగా నిర్ణయించిన ఎజెండానంతా పక్కకు పెట్టి జరుగుతున్నటువంటి చర్చలన్నీ కూడా భారతదేశం కూడా ఇటువంటి అంశాలకు అతీతంగా లేదనేది తెలుస్తుంది. అధికారంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు కూడా ఇటువంటివాటిని విచక్షణారహితంగా రెచ్చగొడుతున్నారనేది మనం చూస్తున్నాం. కాబట్టి నాగరిక ప్రజలందరూ కూడా ఈ అంశాలపట్ల జాగ్రత్తగా ఉండి దేశాన్ని, దేశ సమైక్యతను కాపాడుకోవాల్సిన అవసరముంది.

మనది భిన్నత్వంలో ఏకత్వమనే వారసత్వం కలిగి ఉన్న దేశం. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని బయటకు పంపాలనుకున్నప్పుడు మతం, జాతి, కులం, లింగ విభేదాలనేది లేకుండా మొత్తం భారతీయులందరూ మూకుమ్మడిగా కదిలారు. మహాత్మాగాంధి నాయకత్వంలో ఒక గొప్ప జాతీయ ఐక్యతా స్ఫూర్తిని ప్రదర్శించారు. మళ్ళీ మత సామరస్యాన్ని, లౌకిక విలువలను కాపాడుకోవడానికి అటువంటి స్ఫూర్తి అవసరం. ఈ సభ నుంచి రాష్ట్ర ప్రజానీకానికి కూడా అటువంటి స్ఫూర్తిని ప్రదర్శించాలనే విజ్ఞప్తి పోవాలని కోరుతున్నాను.

అదే సమయంలో తమ స్వార్థ అవసరాల కోసం తాలిబన్లను పుట్టించి, పెంచి పోషించి, వాళ్ళని వెన్నుతట్టి కాసింది అమెరికన్ సామ్రాజ్యవాదం. వారి ఉద్దేశం ఏదైనా నువ్వు పెంచి పోషించింది విషనాగైతే, అది నిన్ను కూడా కాటెయ్యడానికి వెనుకాడదనే దానికి పెద్ద ఉదాహరణ తాలిబన్లు. ఇటువంటి ఉగ్రవాద చర్యలపట్ల ప్రజానీకం ఏమరుపాటుగా ఉండరాదని చాలా అప్రమత్తంగా ప్రజలందరి ఐక్యతను కాపాడుకోవాలని మనం పిలుపునివ్వాలి. మన దేశానికి వారసత్వమైన ఇటువంటి మతోన్మాదపు విచ్ఛిన్నకర సవాళ్ళు కలిస్థాన్, అస్సాం, గూర్ఖాల్యాండ్‌లో వచ్చింది. అయితే ప్రజలంతా ఐక్యంగా ఉండి మేం ఇలాంటివాటిని సాగనివ్వమని నిలబడ్డారు కాబట్టే ఈ దేశం ఇంకా ఇలా ఉంది. అటువంటి స్ఫూర్తిని తిరిగి మరింత బలంగా ప్రేరేపించే దిశగా ప్రభుత్వాలూ, రాజకీయ పార్టీలందరూ కూడా తమ సొంత ఎజెండాలను పక్కకు పెట్టి ఈ విషయంపై ఒక్కమాటమీదకు రావాలని విజ్ఞప్తి చేస్తూ ఈ మారణకాండలో మరణించివారి కుటుంబాలకు మా ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరపున హృదయపూర్వకమైన సానుభూతిని, సంతాపాన్ని తెలియచేస్తున్నాను.

ఉ.10.30

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఇప్పుడు జరిగినటువంటి పెషావర్ సంఘటన, గతంలో జరిగిన ఇరాక్ సంఘటనలు చాలా దారుణమైనవి, సభ్యసమాజం సిగ్గుపడే విషయాలు. ప్రాణభయంతోటి పారిపోతున్నటువంటి చిన్నారులను, బెంచీల కింద దాక్కున్న వారిని బయటకు లాగి చంపారంటే అది చాలా హృదయవిదారకరమైనటువంటి విషయం. అ విధంగా హృదయంలేని వ్యక్తులుగా ప్రవర్తించడం రాక్షసత్వం. ఈ సంఘటన సైనిక పాఠశాలల్లోనే ఎందుకు జరిగిందంటే – మా వాళ్లను సైనికులు చంపారు కాబట్టి మేము కావాలనే సైనిక పాఠశాలల్లోని పిల్లల్ని చంపితే సైనికులు ఏవిధంగా స్పందిస్తారనే ఇలా చేశామని తాలిబన్లు చెబుతున్నారు. ఒక పైశాచిక విధానంతోటి ప్రవర్తించడం చాలా బాధాకరమైనటువంటి సంఘటన. కాబట్టి ఇటువంటి సంఘటనలను అన్ని దేశాలు, ప్రజలు, రాజకీయ పార్టీలు ఒకే మాటమీద ఖండించవలసిన అవసరం ఉంది. ఈ సంఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఇటువంటి మతోన్మాద సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చూడవలసిన అవసరం ఉందని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు : అధ్యక్షా, పెషావర్ సైనిక పాఠశాలలో బాలల పట్ల జరిగిన ఈ సంఘటన ప్రతీ ఒక్కరిని ఆలోచింపచేసే విధంగా, ఇటువంటివి పునరావృతం కాకుండా మనం సమాయత్తం కావాలని ఒక సందేశం ఇచ్చే విధంగా ఉన్నది. ఎందుకు చనిపోతున్నామో తెలియని

పరిస్థితిలో ఉన్న చిన్నారులను వెంటాడి, వేటాడి శత్రువులను మట్టు పెట్టిన విధంగా దారుణంగా సుమారు 130 చిన్నారులను, 10 మంది ఉపాధ్యాయులను, సైనికులను మొత్తం 150 మందిని చంపడం ఎంతైనా దారుణమైన విషయం. ఇరాక్, ఆస్ట్రేలియా ఇంకా కొన్ని కొన్ని చోట్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి కాబట్టి అన్ని దేశాలు కూడా విశ్వ శాంతి కోసం ఒక కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ఇటువంటి సంఘటనలు పాఠశాలల్లో జరుగుతున్నాయి, చదువుకునే చిన్నారులకు రక్షణ లేకుండా పోయింది. కాబట్టి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని దేశాలు కూడా ఆలోచించి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కోరుతూ, ఇటువంటి మతోన్మాదాన్ని, ఉగ్రవాద దాడులను ఖండిస్తూ, పిఆర్‌టియు ఫ్రంట్ తరఫున చనిపోయిన కుటుంబాలకు మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఈ రకమైన చర్చను సభలో ప్రవేశపెట్టినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప : అధ్యక్షా, పెషావర్‌లో సైనిక పాఠశాల మీద జరిగిన దాడిని ఖండించవలసిన అవసరం ఉంది. అగ్రరాజ్యాలు తాలిబన్లను పోషించి వారి పీకలమీదకు తెచ్చుకున్న విషయం అందరికీ తెలుసు. ఆ తాలిబన్లు దేశాలమీద పడి కలకలం సృష్టించిన అనేక సంఘటనలు జరిగాయి. ఇప్పుడు కూడా 140 మంది చిన్నారులను, ఉపాధ్యాయులను చంపడం చాలా దారుణమైన సంఘటన. దీనిని ఖండిస్తూ, ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని భావిస్తూ, అన్ని దేశాలు కూడా ఖండించాలని, మన కేంద్రప్రభుత్వం కూడా ఈ విషయాన్ని తిప్పికొట్టాలని కోరుతూ, చనిపోయిన చిన్నారుల తల్లిదండ్రులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, చిన్నారుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి : అధ్యక్షా, పెషావర్‌లో జరిగిన సంఘటనపై సభ్యులందరూ కూడా బాధాకరంగా ఏవిధంగా వర్ణించాలో కూడా తెలియని స్థితిలో మాట్లాడడం జరిగింది. మన ప్రధానమంత్రి మోడీ గారు అమెరికాకు వెళ్లినప్పుడు అక్కడి ప్రెసిడెంట్ ఒబామా గారితో టెర్రరిస్ట్ విధానాన్ని ఏవిధంగా అణచివేయాలనే విషయాలపై మాట్లాడడం జరిగింది. ఐక్యరాజ్య సమితి ఉన్నప్పుడు ఇటువంటి విషయాలను కొన్ని అగ్రరాజ్యాలు తమ చేతిలోకి తీసుకోవడం మంచిది కాదని వారు చెప్పడం జరిగింది. అయితే, దానిని నేను వ్యతిరేకిస్తున్నాను. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఐక్యరాజ్య సమితి ఏ విధమైనటువంటి చర్యలు తీసుకోలేదు. ఐక్యరాజ్యసమితి ఉన్నప్పటికీ ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటువంటి సంఘటనలు ఏదో విధంగా ఖండించాలనుకున్నప్పుడు ఐక్యరాజ్య సమితి ఏమైనా చర్యలు చేపట్టవచ్చు. కానీ ఖండించడం మాత్రమే జరుగుతోంది. ఈ సంఘటనలో విద్యార్థులను చంపడమే కాకుండా, అడ్డంవచ్చిన ఉపాధ్యాయులను బలవంతంగా చంపేయడం జరిగింది. ఈ సంఘటనలను చూస్తే అసలు ప్రపంచం ఏదిశకు పోతోంది అనిపిస్తున్నది. మనం మోడ్రనైజేషన్ అని చాలా సంతోషపడుతున్నాం కానీ, ఇటువంటి సంఘటనలు మోడ్రనైజేషన్ అనిపించుకోవు. పురాణాలలో రావణుడు లాంటి దుర్మార్గులు శివుడి దగ్గర వరాలు తీసుకుని ఋషులను చంపడం లాంటి సంఘటనలు జరిగేవని బాధపడేవారు. కానీ ఈ రోజు జరిగిన సంఘటనలు చూస్తే అంతకంటే దారుణంగా ఉన్నాయి. దీని మీద ప్రపంచ దేశాలన్నీ కూడా స్పందించి, రిజల్యూషన్స్ చేయాలి. ఈ రోజు ఈ సభలో జరిగిన చర్చల సారాంశం ఆధారంగా రిజల్యూషన్ పాస్ చేయాలని కోరుతూ చనిపోయిన కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

డా. కామినేని శ్రీనివాస్ :  అధ్యక్షా, జరిగిన సంఘటన చాలా బాధాకరం, దుర్మార్గం. పిరికివాళ్ల చర్య.  ఎందుకంటే ముక్కుపచ్చలారని చిన్న పిల్లలు, వారికి ఎవరు ఏ మతమో కూడా తెలియదు.  ఈ చర్యకు పాల్పడిన తాలిబన్లకు ధైర్యం ఉంటే సైనిక దళాలతో పోరాడాలి.  అంతేకాని పాఠశాలల్లోకి చొరబడి ఏమాత్రం రక్షణ లేని చిన్నపిల్లల్ని చంపడం చాలా దుర్మార్గం.  ఇది అందరూ ఖండించవలసిన విషయం.  తప్పకుండా భారతీయ జనతాపార్టీ తరఫున ఈ దుర్మార్గపు చర్యను ఖండిస్తున్నాము.  చనిపోయిన చిన్నారుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము.  ఆ కుటుంబాలకు మా సానుభూతి తెలియజేస్తున్నాము.  అలాగే మతమార్పిడి గురించి  పెద్దలన్నట్లు సమాజంలో ఉన్న కొన్ని లోటుపాట్లను ఆసరాగా తీసుకుని కొన్ని కోట్ల మందిని మతమార్పిడి  చేస్తున్నారు.  అది ఎంత వరకు వెళ్లిందంటే మనందరం పూజించే శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో కూడా జరుగుతోంది.  మనందరం కలిసి మతమార్పిడి విధానాన్ని అరికడదాము.  అది అందరికీ ఇష్టమే.  అంతేకాని ఒకరు చేస్తే న్యాయం, మరొకరు చేస్తే అన్యాయం అంటే సరికాదు.  రివర్స్ డిస్క్రిమినేషన్ అంటారు.  మీరు మెజారిటీ కాబట్టి మీరు అనుభవించండి, వాళ్ల మైనారిటీ కాబట్టి వాళ్లు ఎంజాయ్ చేస్తారు అనడం న్యాయం కాదు.  దయచేసి పెద్దవాళ్లు ఆలోచించాలి. మతమార్పిడీ ఆపేద్దాం.  మన గ్రామాలలో ఏంజరుగుతోందో మనందరికీ తెలుసు.

శ్రీ ఎం.వి.యస్. శర్మ : అధ్యక్షా, ఇది మతమార్పిడీ గురించిన చర్చ కాదు.  మతమార్పిడి మీద చర్చకు మేము రెడీ.

డా. కామినేని శ్రీనివాస్ :  ఎల్.ఓ.పి గారు లేవనెత్తారు కాబట్టి అన్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : నేను ఒక పాసింగ్ రిఫరెన్స్ చెప్పాను.  గతంలో మతమార్పిడీ ఏవిధంగా పెరిగిందో చెబుతూ ఆ సందర్భంలో చెప్పిందే. మీకు ప్రజలు mandate  ఇచ్చారు, సమస్యలు పెద్దగా ఉన్నాయి.  నిరుద్యోగం ఉంది, ధరలు పెరుగుతున్నాయి, వాటికి అటెండ్ అవ్వండి, ఎవరినో తీసుకువచ్చి కూర్చోబెట్టి యజ్ఞాలు చేయించడం ఏమిటి? How can you justify it ? మూడు, నాలుగు వందల సంవత్సరాలు వాళ్లు పరిపాలించినప్పుడు జరిగిన మతమార్పిడీ ఈ రోజు మార్చమని మీకు mandate  ఇవ్వలేదు.  Sir, I don’t want to bring a discussion.

ఉ.10.40

శ్రీ కామినేని శ్రీనివాసరావు: అధ్యక్ష, నేను ఆ టాపిక్ రెయిజ్ చేయను. నాకు తెలుసు. ప్రభుత్వంలో అధికారంలో ఉన్నవారు ఇలా చేస్తున్నారని ప్రతిపక్షం వారు రెయిజ్  చేస్తే సమాధానం చెప్పవలసిన బాధ్యత నాకు ఉంది.

శ్రీ సి. రామచంద్రయ్య :  ఆ వాతావరణం ఈ దేశంలో దయచేసి తీసుకురాకండి.  మీకు నమస్కారం పెడుతున్నాను.

శ్రీ యం.వి.యస్.శర్మ :  అధ్యక్ష, చాలా మానవత్వంతో ఉదాత్తంతో మనం చర్చ జరుపుతున్నాము, దానిని డైవర్షన్ చేయకండి.

శ్రీ మహ్మద్ జానిః అధ్యక్ష, సానుభూతి అన్నారు. ఇక్కడ మంత్రిగారు ఏ ఇష్యూను రెయిజ్ చేశారు?

శ్రీ పైడికొండల మాణిక్యాలరావు ః అధ్యక్ష, పెషావర్‌లో పిల్లల మీద జరిగిన ఈ అమానుష చర్యకు ప్రపంచమంతా నివ్వెర పోవడమే కాకుండా, భారతదేశంలో ఉన్న ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఈ సంఘటన ద్వారా ప్రపంచానికి తేటతెల్లమయింది. మత ప్రాతిపదికమీద దేశ విభజన జరిగి ఏ వ్యక్తి కూడా క్షేమంగా లేని పరిస్థితి ఇది. ఈ రోజు ప్రపంచమంతా కూడా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌ను చూస్తుంది. ముస్లిం సమాజం కూడా చూస్తుంది. ఈ సంఘటన తరువాత పాకిస్థాన్‌లో ఉన్న నా మిత్రుడు ఫోన్‌చేసి ఈ విషయాన్ని తెలియచేయడం జరిగింది. మీ దేశంలో ఉన్న మా మతం వాళ్లు చాలా సంతోషంగా, మీతో సమానంగా జీవితాన్ని గడుపుతుంటే మా దేశంలో మాత్రం ఏ నిమిషంలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి కనపడుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితిలో మన భారతదేశంలో ఎలాంటి ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందో, ఇలాంటి వ్యవస్థ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌లో రావాలని కూడా నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, జరిగిన ఘోరమైన దుర్ఘటనని ఖండిస్తూ, సమాజమంతా రాజకీయాలకు వ్యతిరేకంగా, ప్రపంచంలో ఉన్న వారందరూ కూడా ఇలాంటి సంఘటనలు ఖండించాల్సి ఉందని భావిస్తున్నాను. దీనికి మెజారిటీ, హిందూ, క్రైస్తవులని గాని మాట్లాడుతూ ఏదో ఒక వ్యక్తినిగాని, ఏదోఒక మతాన్నిగాన్ని టార్గెట్ చేయాలనే ఆలోచన మనదేశంలో కూడా ప్రధానంగా వ్యక్తం చేసే విధానం మంచిదికాదు, ఈ సంఘటన ఎవరు చేసినా ఖచ్చితంగా ఖండిచాల్సిన అవసరం ఉంది. ప్రపంచమంతా కూడా ఒకే త్రాటిపై నిమగ్నమవ్వాలని తెలియజేస్తూ, ఈ ఘోర దుర్ఘటనకు బాధితులైన తల్లిదండ్రులకు, వారి పిల్లలకు మనశ్శాంతి కలగాలని, ఆ పిల్లలకు మంచి గతులు ప్రాప్తించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు ః అధ్యక్ష, పెషావర్ సంఘటన పార్టీలకు, మతాలకు అన్నింటికి అతీతంగా ముక్తకంఠంతో ఖండించాల్సి ఉంది. అది ఎక్కడ జరిగింది, ఎలా జరిగింది, దానికి ఎవరు బలయ్యారు ఇవన్నీ ఆలోచిస్తుంటే అది పాకిస్థాన్‌లో జరిగినా కూడా భారతదేశంలో ఉన్న ప్రతి తల్లిదండ్రులు ఆందోళన పడే విషయం ఇది. ముఖ్యంగా ఒకరిద్దరి పిల్లలు బతికిన సంఘటనలు వారు చెబుతూ ఉంటే, ఒక పిల్లవాడు వాళ్ల ఎంట్రీ చూసి మేము చనిపోయినట్లు నటించాము, లేకపోతే మమ్మల్ని కూడా కాల్చేసేవాళ్లని చెబుతూ ఉంటే, అసలు మానవత్వం మచ్చుక కూడా లేకుండా ఎంత హృదయవిదారకంగా వారిని కాల్చేశారో అది మాటల్లో వర్ణించలేనిది. నరేంద్రమోడి గారు చెప్పినట్లు ఇది ఒక్క దేశానికే కాదు, ప్రపంచం మొత్తానికి ఒక పెద్ద ముప్పు, దానిని అందరూ కూడా ముక్త కంఠంతో ఖండించాల్సి ఉంది. HRD మినిస్టర్‌గా ఈ సంఘటన జరిగిన వెంటనే అన్ని స్కూల్స్‌లో కూడా రెండు నిమిషాలు మౌనం పాటించాలని చెప్పడం జరిగింది. దీనిని ముక్తకంఠంతో ఖండించడం జరిగింది. అలాగే ఆ చిన్న పిల్లలకు ఆత్మశాంతి కలగాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాము.

మిస్టర్ ఛైర్మన్ ః

## సంతాపతీర్మానము

ఉగ్రవాద ఉన్మాదంతో పాకిస్థాన్ దేశంలోని పెషావర్ పట్టణంలో ఒక సైనిక పాఠశాలలో 130 మంది విద్యార్థులను, మరో 11 మంది వ్యక్తులను తాలిబన్ తీవ్రవాదులు కాల్చివేసిన సంఘటనను ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తీవ్రంగా ఖండిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నది. అలాగే ఇరాన్, ఇరాక్ ఆస్ట్రేలియా, సిరియా మరియు అనేక దేశాలలో జరిగిన తీవ్రవాద సంఘటనలను ఏకగ్రీవంగా ముక్త కంఠంతో ఈ సభ ఖండిస్తున్నది. ఈ ఉదంతం పట్ల తీవ్ర ఆవేదనను తెలియజేస్తూ వారి ఆత్మలకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ ఉదంతంలో ప్రాణాలు కోల్పోయిన అందరికి నివాళులు అర్పిస్తున్నాను. ఈ సభ వారు రెండు నిముషాలు మౌనం పాటించాలని ప్రార్థిస్తున్నాను.

(సభ రెండు నిముషాలు మౌనం పాటించడం జరిగింది.)

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

### విశ్వవిద్యాలయాల్లో ఎస్.సి. రిజర్వేషన్ క్రింద ఉన్న ఖాళీపదవులు

ప్రశ్న నెం.7794
శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ?

అ) ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలలో రిజర్వేషను నియమాన్ని అమలు చేయడమవుతున్నదా?
ఆ) అయితే, రోస్టరు ప్రకారం ఒక్కొక్క విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఎస్సిల సంఖ్య ఎంత ?
ఇ) విశ్వవిద్యాలయాలలో ఎస్.సి రిజర్వేషను క్రింద ఖాళీగా ఉన్న పదవుల వివరాలు ?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు)

అ) అవునండీ.
ఆ) గౌరవ సభ్యుల దృష్టికి తెచ్చేందు కోసం వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.
ఇ) విశ్వవిద్యాలయాలన్నింటిలో టీచింగ్ కేటగిరీ క్రింది 103 ఖాళీ పదవులు, నాన్–టీచింగ్ కేటగిరీ క్రింద 113 పదవులు ఖాళీగా ఉన్నాయి.

శ్రీమతి పమిడి శమంతక మణి (శాసనసభ నియోజకవర్గం) ః అధ్యక్ష, అంబేద్కర్ గారి రాజ్యాంగ రచనలోనే ఆయా కులాలకు, ఆయా తెగలకు కావలసిన రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. కానీ ఈ నాడు గమనిస్తూంటే ఉంటే రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంటున్నారు, మరి విశ్వవిద్యాలయాల్లో పదవుల పందేరం జరుగుతుంది. కానీ దళితులకు జరగాల్సిన న్యాయం ఎక్కడా

జరుగడం లేదు. కంటితుడుపు చర్యగా ఇక్కడ ఒక క్యాటలాగ్ పెట్టడం జరిగింది. దానిలో గమనిస్తే, యోగివేమన యూనివర్సిటీలో టీచింగ్‌కి సంబంధించి 12 ఖాళీలు ఉన్నాయి. జెయన్‌టియు యూనివర్సిటీ అనంతపురంలో 26 ఉన్నాయి. నాగార్జున యూనివర్సిటీలో 10 టీచింగ్ పోస్టులు, కొన్ని నాన్-టీచింగ్ పోస్టులు చూపించడం జరిగింది. అక్కడ ఏమి జరుగుతుందో ఒకసారి పరిశీలన చేస్తే, అక్కడ ఇంటర్వ్యూలు చేస్తున్నారు. కానీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ మాత్రం ఎక్కడా పాటించడం లేదు. ఎక్కడ బయట చెబితే ఆ ఖాళీలు పూర్తిచేసుకుంటారో, దళిత విద్యార్థులకు ఉద్యోగాలు కేటాయించడం జరుగుతుందనే ఉద్దేశంతో కొన్ని సంవత్సరాలుగా కప్పిపుచ్చడం జరుగుతుంది. మరల దానిని దళితులు ఎవరూ లేరు కాబట్టి ఇంకొక కేటగిరీ కిందకు మార్చడం జరుగుతుంది. చాలా మంది ఉపాధ్యాయలుగాని, లెక్చరర్లుగాని ఈ రోజు కోర్టులను ఆశ్రయించడం జరుగుంది. ఏమైనా గట్టిగా మాట్లాడితే మీకేసు కోర్టులో ఉంది కాబట్టి కోర్టు తీర్పు ఇచ్చేవరకు మీరు ఏమి మాట్లాడకూడదని అంటున్నారు. ముఖ్యంగా దళితులు పేదవారు, వారు చదువుకోవడానికి రావడమే గొప్ప. అటువంటి వారికి ఉద్యోగ అవకాశాలు లేకపోతే నిరుద్యోగులు ఏమౌతారు? వారికి ఎందుకివ్వకూడాదు? 103 ఖాళీలు ఉన్నాయని మంత్రిగారే చెబుతున్నారు, గతంలో గమనిస్తే ఒక్కొక్క ఉపకులపతి అవినీతి, అక్రమాలు ఈ నియామకాలలో చాలా జరిగాయి. ఈ రోజు అనంతపురం జిల్లా కరువు జిల్లా, దానిలో జెయన్‌టియు యూనివర్సిటీలో 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే, ఇంజనీరింగ్ చదివిన దళితులు ఎవరూ లేరా?

ఉ.10.50

దీని విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారనేది మంత్రి గారు చెప్పడం లేదు. కేవలం, గౌరవ సభ్యులు అడిగారు కాబట్టి, ఇదిగో ఈ లిస్టు ఇస్తున్నాను, అది తీసుకుని చదువుకుని మీరు సంతృప్తి చెందండి అనంటే ఎట్లా సార్? గతంలో అనంతపురం జిల్లాలో దళితుల కోసం ప్రత్యేకంగా ఒక స్టడీ సెంటరు ఉండేది.

MR.CHAIRMAN: Please put your Supplementary.

శ్రీమతి పి. శమంతకమణిః అధ్యక్షా.. నేను సప్లిమెంటరీనే అడుగుతున్నాను. ఎక్కడా నేను డీవియేట్ కాలేదు. మేము దళితుల గురించి మాట్లాడుతున్నప్పుడు కూడా మీరు అవకాశమివ్వకపోతే ఎట్లా అధ్యక్షా? ఏదో మా ముఖాన ఇది పడేశామనంటే ఎట్లా? మా పిల్లల భవిష్యత్తు ఏం కావాలి? ఎప్పటిలోపు ఈ ఎస్సీ బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేస్తారు? యూనివర్సిటీల్లోని వివిధ ఖాళీల నియామకాల్లో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించి ఒక్కొక్క విశ్వ విద్యాలయ ఉప కులపతుల మీద ఏం చర్యలు తీసుకోబోతున్నారనేది కూడా చెప్పమనండి.

శ్రీ కె.ఎస్.లక్ష్మణ రావు (ఉపాధ్యాయ నియోజకవర్గం, కృష్ణా, గుంటూరు) ః అధ్యక్షా, వివిధ విశ్వ విద్యాలయాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు జరగకపోవడానికి గానీ, పోస్టులు భర్తీ కాకపోవడానికి గానీ ప్రధాన కారణమేమంటే, గత మూడు, నాలుగేళ్లుగా యూనివర్సిటీల్లో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకాలు జరగలేదు. వాస్తవానికి ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ అమలులో ఉండుంటే, అవి ఆయా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లను నియంత్రిస్తాయి. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నిర్ణయాలు చేయాలి. అవి లేకపోవడం మూలంగా వీసీలు తమ ఇష్టం వచ్చినట్లు నియామకాలు

చేస్తున్నారు. కాబట్టి, నేను మంత్రిగారిని మీ ద్వారా కోరేదేమంటే – అతి త్వరలో అన్ని యూనివర్సిటీల్లో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకం చేపట్టండి. అలాగే, ఆ ప్రాంతంలో జరిగే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకాల్లో గౌరవ సభ్యులు శ్రీమతి పి. శమంతకమణి గార్ని కూడా సభ్యులుగా నియమించాలని మీ ద్వారా నేను మంత్రి గారిని కోరుతున్నాను. ఎందుకంటే, శాసన సభ, శాసన పరిషత్తు సభ్యులను కూడా ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లలో సభ్యులుగా నియమించవచ్చు. మంచి సభ్యులను ఎంపిక చేసి, ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్‌ని నియమిస్తే ఆ ప్రక్రియ కూడా పూర్తవుతుంది. అందువల్ల మీ ద్వారా నేను మంత్రి గారిని అడిగేదేమంటే – ఎప్పటిలోపు ఈ యూనివర్సిటీల్లో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్‌ని నియమిస్తారో చెప్పమనండి.

డా. బచల పుల్లయ్య (ఉపాధ్యాయ నియోజకవర్గం, కడప, అనంతపురం, కర్నూలు) ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీమతి పి. శమంతకమణి గారు చెప్పినట్లుగా యూనివర్సిటీల్లో జరిగే నియామకాల్లో ఎస్సీ అభ్యర్థులకు తగిన అవకాశాలు కల్పించడం లేదనే మాట నూటికి నూరు శాతం వాస్తవం. ఈనాడు మనం గమనించినట్లయితే, వాటితోబాటు అనేక యూనివర్సిటీల్లో రిక్రూట్‌మెంట్లకు నోటిఫికేషన్లు ఇచ్చి దరఖాస్తులు స్వీకరించిన తరువాత కూడా ఖాళీలను భర్తీ చేయడంలేదు. ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రకారం, ఎప్పటిలోపు ఆ ఖాళీలను భర్తీ చేస్తారనేది చెప్పవలసిందిగా మీ ద్వారా నేను మంత్రి గారిని అడుగుతున్నాను.

ముఖ్యంగా ఈ నియామకాలు జరగకపోవడానికి కారణం పాలకమండళ్లు ఏర్పాటు చేయకపోవడమే. దాదాపు నాలుగు సంవత్సరాలుగా ఏ యూనివర్సిటీలోనూ పాలకమండళ్లు లేవు. వీలైనంత త్వరగా పాలకమండళ్లు ఏర్పాటు చేయాలి. అవి ఎప్పటిలోపు చేస్తారు? పాలక మండళ్లు ఏర్పాటు చేసేటట్లయితే, అయా జిల్లాల్లోని టీచర్ ఎమ్మెల్సీలకు కూడా ఆ మండళ్లలో స్థానం కల్పించినట్లయితే బాగా పని చేసేందుకు అవకాశముంటుందని మీ ద్వారా గౌరవ మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యంః అధ్యక్షా, మంత్రి గారు సభ్యులకిచ్చిన సమాధానంలో ఎస్సీలకు సంబంధించి వివిధ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో ఎన్నెన్ని వేకెన్సీలు ఉన్నాయనేది చెప్పారు. అసలు జనరల్ వేకెన్సీలు కూడా ఎన్ని ఉన్నాయనేది తెలిస్తే, అందులో ఎస్సీ వేకెన్సీలు చాలా ఎక్కువగా ఉన్నాయా, తక్కువగా ఉన్నాయా అనేది కూడా తెలిసే అవకాశముండేది. ఆ లెక్కలు కూడా సభకు సమర్పిస్తే బాగుంటుందనేది నా అభిప్రాయం. వారు ఆ వివరాలు కూడా సభకివ్వాలి. లేకపోతే, గ్లేరింగ్‌గా ఎస్సీలకు మాత్రమే అన్యాయం జరిగిందా, లేక మొత్తం మీద గత కొద్దికాలంగా ఖాళీలు భర్తీ చేయకుండా పోయిన క్రమంలో వీళ్లకు కూడా అన్యాయం జరిగిందా అనేటటువంటిది సభ్యులకు తెలిసుండేది.

ఇక రెండవదేమంటే – ఈ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించే విధానం పరమ లోపభూయిష్టంగా ఉంది. మీరొక ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌ని అపాయింట్ చేయాలంటే ఎవ్వరు రికమెండ్ చేసినా కూడా అయ్యే పని కాదు. అంత పద్ధతిగా, పకడ్బందీగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకాలు జరుగుతాయి. కానీ, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి మాత్రం ఎలాంటి నిబంధనా లేదు. ఆ విషయం మాకు తెలుసు. చాలా బాధాకరమైన పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీలుగా ఉండే వాళ్లు ఆ రంగంలోకి

దిగడానికి నానా కష్టాలుపడే పరిస్థితి ఉంది. అందువల్ల, యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలకు సంబంధించి కొంతమేరకు తమిళనాడులో ఒక పకడ్బందీ విధానం అమలులో ఉంది. అలాంటి విధానాన్ని మీరు కూడా ప్రకటించి, అమలుచేసినట్లయితే అందరికీ న్యాయం జరుగుతుంది. ఆ ఎస్సీల్లో కూడా, నిజమైన వాళ్లకి న్యాయం జరుగుతుంది. దీని విషయాన్ని కూడా ప్రకటించాల్సిందిగా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ ఎం. సుధాకర్ బాబు (శాసనసభ నియోజకవర్గం) ః అధ్యక్షా, ఈ రోజు ఈ ప్రకటన చూస్తుంటే, దళితులను మిగతా సమాజానికి దూరం చేసినట్లు అనిపిస్తోంది. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో 214 అధ్యాపకుల పోస్టులున్నాయని ప్రకటిస్తారు. అన్నీ దళితులకే అనంటారు. పక్కన ఉండే మిగతా కులాల విద్యార్థులు ఏమనుకుంటారంటే – " **ఈ నా కొడుకులు** ఉద్యోగాలన్నీ దళితులకు ఇచ్చేస్తున్నారు " అని అనుకుంటారు. మీరు గత ముప్పై ఏళ్లుగా బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేయకుండా విడిచిపెట్టి, మిగతావి 99 శాతం భర్తీ చేసుకుని, దళితుల ఉద్యోగాలు మాత్రమే పక్కకు పెడతారు. ఎందుకంటే, ఎన్నికలప్పుడో, మరో సమయంలోనో దళితులను ఉపయోగించుకోవడానికి మాత్రమే ఎస్సీ బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయండని అంటారు. అప్పుడు కూడా పది పోస్టులుంటే, రెండు పోస్టులు భర్తీ చేసి, ఎనిమిది పోస్టులకు బొక్క పెడతారు. ఈ విధంగా మమ్మల్ని మిగతా సమాజం నుండి దూరం చేయడానికి ప్రయత్నం చేయవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది ఎవరు చేసినా తప్పే.

కానీ, ఒక్క విషయం మీకు మనవి చేస్తున్నాను. ఇక్కడ మంత్రి గారిచ్చిన సమాధానంలో ప్రతి చోట 10, 15, 24 వరకు ఖాళీలు చూపిస్తున్నారు. ఈ రోజు పీజీలు కాదు, డబుల్ పీజీలు చేసి, ఉద్యోగాలు లేక గడ్డాలు పెంచుకుని తిరుగుతున్న దళితులు కోకొల్లలు. దయచేసి మీరన్నా వెంటనే బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేసి పుణ్యం కట్టుకోండి. మరోసారి బ్యాక్‌లాగ్ ఖాళీలనేవి ఉండకూడదు. ఉంటే అందరివీ బ్యాక్‌లాగ్ పోస్టులుండాలి గానీ, కేవలం దళితులకు మాత్రమే బ్యాక్‌లాగ్ పోస్టులు చూపించవద్దని మా మనవి.

రెండవదేమంటే, మీ ద్వారా నేను ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. ప్రతి యూనివర్సిటీలో వీసీలు వారి ఇష్టానుసారంగా ఉద్యోగాలిచ్చేశారు. దయచేసి, ప్రతి యూనివర్సిటీలో ఎన్ని ఉద్యోగాలున్నాయి? రోస్టర్ ప్రకారంగా అన్ని కులాలకు కరెక్టుగా న్యాయం జరిగిందా, లేదా అనేది చూడాల్సిందిగా మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆ వివరాలు మాకు తెలియజేస్తే బాగుంటుందని కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావుః అధ్యక్షా, సోదరీమణి శ్రీమతి పి. శమంతకమణి గారు, ఇతర సభ్యులు శ్రీ కె.ఎస్.లక్ష్మణ రావు, డా. బచల పుల్లయ్య, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం, శ్రీ ఎం. సుధాకర్ బాబు గార్లు దళితుల పట్ల వారికున్న సానుభూతిని వ్యక్తపరిచారు. నేను కూడా హెచ్ఆర్‌డీ మినిస్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఒక మాట చెబుతున్నాను. గత కొద్ది సంవత్సరాలుగా మన ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థ ఎలా ఉందంటే – ఒక కదులుతున్న చెక్క గుర్రంలా ఉందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అంటే మూవ్‌మెంట్ ఉంది గాని, ముందుకుపోవడం జరగడం లేదు. యూనివర్సిటీల్లో ఖచ్చితంగా టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలున్నాయి. వాటిని భర్తీ చేయాల్సిన అవసరముంది.

అట్లాగే, యూనివర్సిటీలో పాలకమండళ్లు ఎప్పటి నుండో ఖాళీగా ఉన్నాయి. వాటిని కూడా భర్తీ చేయాల్సిన అవసరముంది. అట్లాగే, వైస్ ఛాన్సలర్లు కొన్ని రిక్రూట్‌మెంట్లు చేస్తున్నారు. వాటిల్లో కూడా అక్రమాలు జరుగుతున్నాయి, కొన్ని ఇర్రెగ్యులారిటీలు జరుగుతున్నాయని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. వీటన్నింటిలో కూడా కొంత వాస్తవం ఉంది. అయితే, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి సంబంధించి ఇప్పటిదాకా యూనివర్సిటీ వైజ్ డేటాని ఇవ్వడం జరిగింది. ఇప్పటికే అమలులో ఉన్న గైడ్‌లైన్స్ ప్రకారం వంద శాతం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నాము. అందులో ఎక్కడా కూడా తేడా లేదు. మొత్తం 1,864 పోస్టులకు గాను, మొత్తం 309 ఖాళీలు ఎస్సీలతో భర్తీ చేయడం జరిగింది. ఖచ్చితంగా, ఎస్సీలకు రావాల్సిన రేషియో మేరకు 16 శాతం ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేసిన విషయం వాస్తవం. కేవలం ఎస్సీ బ్యాక్‌లాగ్ ఖాళీలు మాత్రమే కాదు. దానితోబాటు జనరల్ ఖాళీలు కూడా కొన్ని ఉన్నాయి. అన్ని యూనివర్సిటీల వారు కూడా ఇ.సి. మీటింగ్‌లు పెట్టుకుని, రేషనలైజ్ చేసుకుని, ఎంత మేరకు అవసరముంటుందన్నది చూసుకుని ఫైనలైజ్ చేద్దామనే ఉద్దేశంతో దాన్ని పెండింగులో పెట్టడం జరిగింది.

అంతేగాకుండా, ముఖ్యంగా మొన్న నాలుగు యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల పదవీకాలం ముగిసింది. గతంలో వీసీల టెన్యూర్ కంప్లీట్ అయినప్పుడు, జనరల్‌గా ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ని ఆయా యూనివర్సిటీలకు ఇంఛార్జ్‌లుగా నియమించేవాళ్లం. అలా నియమించినప్పుడు, వాళ్లకున్న వర్క్‌లోడ్‌తో ఈ డ్యూటీలకు కూడా వాళ్లు అటెండ్ కాలేరన్న ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా ఆ యూనివర్సిటీల్లోని రెక్టార్స్‌ని గానీ, ఉన్నత విద్యాశాఖ కార్యాలయం వైస్ ఛైర్మన్‌ని గానీ, లేదా పక్క యూనివర్సిటీల్లో ఉన్న వైస్ ఛాన్సలర్లని గానీ ఇంఛార్జులుగా వేశాము.

అట్లాగే, ఇ.సి. మెంబర్లని కూడా త్వరలోనే నియమించబోతున్నాము. దానికి సంబంధించి ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే టీచర్ ఎమ్మెల్సీలతో ఒక మీటింగ్ పెడదామనుకుంటున్నాము. గైడ్‌లైన్స్ ఎలా ఉండాలి, ఎలా చేస్తే బాగుంటుందన్న దాని మీద ఒక మీటింగ్ పెడతాము. నేనొక డేట్ చెబుతాను. ఆ రోజున ఇంట్రస్ట్ ఉన్న సభ్యులందరూ కూడా పార్టిసిపేట్ చేయండి. తప్పకుండా ఒక మోడల్‌గా ఉండేలా విద్యా వ్యవస్థలో మార్పులకు మనం శ్రీకారం చుడదాము.

అట్లాగే, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ మీద అలిగేషన్స్ వస్తే, వెంటనే హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు వారితో ఎంక్వైరీ చేయించాము. వారొక రిపోర్టు కూడా ఇచ్చారు. దాని విషయంలో కూడా యాక్షన్ తీసుకోవాలనుకుంటున్నాము. ఇలా, సాధ్యమైనంత వరకు ఒక ఫెయిర్ అండ్ ట్రాన్స్‌పరెంట్ విధానంలో అపాయింట్‌మెంట్లు చేయాలని భావిస్తున్నాము. ఆ విధంగా ఖచ్చితంగా చేస్తాము. అలాగే, ఈ రిజర్వేషన్లకు సంబంధించి ఎక్కడన్నా రిజర్వేషన్లు అమలు చేయలేదని గానీ, రూల్స్‌ని వయలేట్ చేశారని గానీ తెలిస్తే, మా నోటీసుకు తీసుకురండి. అక్కడ తప్పకుండా 100 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాము.

ఉ.11.00 & 11.10

**రాజమండ్రి వద్ద రోడ్డు – రైలు వంతెన**

**ప్రశ్న నెం.7678 (2)**

సర్వశ్రీ బి. చంగల్ రాయుడు, రుద్రరాజు పద్మరాజు, ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు  భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) తరచుగా భారీ వాహనాల రాకపోకల కారణంగా రాజమండ్రిలోని రోడ్డు-కం-రైల్వే వంతెన తీవ్రంగా దెబ్బతిన్నదని, నాణ్యతా ప్రమాణాలను అనుసరించకుండా తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేస్తున్నారనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఆ) అయితే, రోడ్డు-కం-రైల్వే వంతెనను సక్రమ నిర్వహణ కోసం ప్రభుత్వం తీసుకోబోయే చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు మరియు  భవనాల శాఖ మంత్రి **(**శ్రీ సిద్ధా రాఘవరావు **):**

అ) అవునండీ. ఇప్పటివరకు చేసిన పనులను నిర్ణీత ప్రమాణాలు, నాణ్యత మేరకు చేయడమయింది.  చేపట్టవలసి ఉన్నట్టి పనులను, మైక్రో కాంక్రీటింగ్ పనులను ఆ రంగంలోని నిపుణుల ద్వారా చేపట్టడమయింది.

ఆ) ఒక తాత్కాలిక చర్యగా తక్షణమే వేరింగ్ కోట్, ఫుట్‌పాత్‌లు, హ్యాండ్ రైల్స్‌కు మరమ్మతులు చేపట్టడానికి ఇటీవలే హైదరాబాదులోని ఇఎన్‌సి (ఆర్ &  బి) పరిపాలన మరియు ఎస్‌ఆర్ శాఖకు ఆదేశాలను జారీచేయడమయింది.  అప్పటివరకు రైల్వే వారితో సంప్రదించి మరమ్మతులు చేపట్టే పరిశోధనా పద్ధతిని నిర్ణయించడమయింది.  రైడింగ్ సర్‌ఫేస్, ఇతర అనుబంధ పనులను మెరుగుపరచేందు కోసం కేటాయింపులతో రూ.2.5కోట్ల అంచనా వ్యయాన్ని మంజూరు చేయడమవుతున్నది.

శ్రీ బి.చంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఈ బ్రిడ్జి  నిర్మాణం ఎప్పుడు జరిగింది? ఎవరు దీనిని చేపట్టారు. ఆందులో రోడ్డు మరియు భవనాల శాఖ కంట్రిబ్యూషన్ ఎంత? ఈ మధ్య డ్యామేజీ అయిన పనులను ఎవరు టేకప్ చేశారు? రెండవది,  ఈ బ్రిడ్జి మీద టోల్‌గేటు గతంలో ఏమైనా వసూలు చేశారా? ఒకవేళ వసూలు చేసి ఉంటే,  ఎంత వసూలు చేశారు? టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్  యొక్క ఒపినియన్ ఏమైనా వచ్చిందా? What is the technical flaw for this very bad quality of the Road? అధ్యక్షా, గతంలో దీని మీద రెండు, మూడు ఆర్టికల్స్ వచ్చాయి. వాటిని బేస్ చేసుకొని మేము కొన్ని పేపర్లను తయారుచేయడం జరిగింది. ఈ బ్రిడ్జి చాలా పూర్ కండిషన్‌లో నడుస్తోంది కాబట్టి రాత్రి పూట ఆ బ్రిడ్జి మీద భారీ వాహనాలు  పోకూడదని హైకోరు కూడా  డైరెక్షన్ ఇచ్చింది. ట్రాఫిక్ పోలీసులు ఈ డైరెక్షన్‌ను అమలు పరచకపోవడం వల్ల రాత్రి పూట భారీ వాహనాలు వెళుతున్నాయి. దాని మీద ఏమి చర్యలు తీసుకుంటున్నారని మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.  త్వరలో గోదావరి పుష్కరాలు రాబోతున్నాయి. పుష్కరాల కాలంలో దాని మీద ఎంతో మంది ప్రయాణం చేయవలసి వస్తుంది కాబట్టి దీనిమీద ఎక్కువ దృష్టి పెట్టాలని మీ ద్వారా ప్రభుత్వానికి ఒక చిన్న సలహా ఇస్తున్నాను.  అతి త్వరలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ దానిని విజిట్ చేయకపోతే చాలా నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే దాని మీద చాలామంది కథలు, కథలు చెబుతున్నారు. దీనిలో ఎక్కడనో లోపం ఉంది. మూడు ప్రక్కల బాగానే ఉంది. నాల్గవ ప్రక్కన ఉన్న లోపం వల్ల క్రింద రైళ్లు వెళుతుంటే పైన అదిరి అది చిక్కి పోతుందని అంటున్నారు. దానిని అరెస్ట్ చేసే మార్గం ఎవరు చేయగలుగుతారు? మద్రాసులో ఒక టీం ఉందన్నారు. కలకత్తాలో ఒక టీం ఉందని అంటున్నారు. వాళ్లను ఎప్పటిలోపు పిలవగలుగుతారు? ఎప్పటి లోపు దీనిలో ఉన్న లోపాలను సరిదిద్దగలుగుతారు? లోపాలను సరిదిద్దే పని ఈ పుష్కరాల లోపు అయ్యే అవకాశం ఏమైనా ఉందా? లేదా వచ్చే పుష్కరాల వరకు పెండింగ్‌లో పెడతారా?

శ్రీ రుద్రరాజు పద్మరాజు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలను కలుపుతూ కొవ్వూరు నుండి రాజమండ్రి వరకు దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఈ రైలు-కం-రోడ్డు బ్రిడ్జి నిర్మాణాన్ని చేసేటప్పుడు నా చిన్నతనంలో ఆ కట్టడాన్ని చూడటానికి వెళ్ళేవారం. ఇది జాతీయ కట్టడం. It is a national monument. దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. 2010 సంవత్సరానికి ముందు కొవ్వూరుకు సంబంధించి పుల్లారావు అనే లాయరు, న్యాయమూర్తి అయిన ఎల్. నరసింహారెడ్డి గారు రాజమండ్రిని సందర్శించినప్పుడు ఈ బ్రిడ్జి స్థితిగతుల గురించి ఆయన దృష్టికి తీసుకు వెళ్లడం జరిగితే ఆయన అదే బ్రిడ్జి మీద ప్రయాణం చేసి అక్కడున్నటువంటి loopholesను గాని, అక్కడ ఉన్నటువంటి పరిస్థితులను స్టడీ చేసి, అది swing అవుతుందనే విషయాన్ని గ్రహించి దీనిని ఒక పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్‌గా ఆరోజు ఆంధ్రప్రదేశ్‌కు చీఫ్ జస్టిస్‌గా ఉన్న నిస్సార్ అహ్మద్ కక్రూ గారి దృష్టికి తీసుకెళ్లి దీని మీద తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆరోజే కోరితే దీనిమీద సంజీవరావు కమీషన్‌ను వేసిన విషయం గౌరవ మంత్రివర్యులకు తెలిసిన విషయమే. ఆ కమీషన్ కూడా దీని మీద తక్షణమే చర్యలు తీసుకోవాలని డైరెక్షన్ ఇవ్వడం జరిగింది. నరసింహా రెడ్డి గారు ఈ మధ్యనే పాట్నాకు చీఫ్ జస్టిస్‌గా వెళ్లారు. ఈ రైలు-కం-రోడ్డు బ్రిడ్జి అసియా ఖండంలోనే రెండవ పెద్ద బ్రిడ్జి. ఇటువంటి కట్టడానికి, అక్కడున్న రోడ్డుకు వచ్చిన పగుళ్లు కాని, అక్కడున్న జాయింట్స్‌కు సంబంధించిన స్క్రూ లూజ్ కావడం వల్ల చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. 1994 వ సంవత్సరంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైతే దాదాపు 40 మంది ప్రయాణీకులు చనిపోవడం ఇంకా మది నుంచి తొలగిపోలేదు.

మిస్టర్ ఛైర్మన్ : పద్మరాజు గారూ బ్రీఫ్‌గా చెప్పండి.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : దీని యొక్క ప్రాముఖ్యతను, దీని బ్యాక్ గ్రౌండ్‌ను చెబితే కాని అర్థం కాదు.

అధ్యక్షా, త్వరలో పుష్కరాలు కూడా రాబోతున్నాయి. ఆ కట్టడం యొక్క నిర్మాణం సరిగా లేనటువంటి పరిస్థితులలో గత ప్రభుత్వంలో దీని మీద దాదాపు రూ.2.50కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఇంకా ఖర్చు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే రవాణ శాఖ మంత్రి గారు కూడా రెండు సార్లు రాజమండ్రి సందర్శించి స్థానిక అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అక్కడున్న పరిస్థితులను తెలుసుకొని, సహచర మంత్రులతో కూడా చర్చించి దీని కోసం నిధులను కేటాయిస్తున్నారు. కాని, దీనికి ఉన్న ఇబ్బంది ఏమిటంటే – ఇది రోడ్డు-కం-రైలు బ్రిడ్జి కాబట్టి రైల్వే వారిని కూడా సమన్వయం చేసుకోకపోతే దీనిని పటిష్టంగా గాని, పగడ్బందీగా కాని చేయడానికి వీలు లేదు. దీనిలో lapses ఉన్నాయి. ఆ దృష్ట్యా డిలే జరుగుతోంది కాబట్టి, 4.2 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డు-కం-రైలు బ్రిడ్జిని వీలైనంత తొందరలో చాలా పగడ్బందీగా, పటిష్టంగా ఆ ప్రాంత వాసుల వాహనాలు ఇబ్బంది లేకుండా సజావుగా వెళ్లే విధంగా చేయాలని కోరుతున్నాను. అదే విధంగా, ఆ బ్రిడ్జి మీద లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేయాలి. దాని చుట్టూ ఉన్న ప్రొటెక్టివ్ వాల్ కూడా డ్యామేజి అయింది కాబట్టి దానిని కూడా పటిష్టం చేయాలి. ఇవన్నీ చేసిన నాడే దానికి పరిపూర్ణత ఏర్పడుతుంది కాబట్టి దయచేసి దానిని త్వరలో పూర్తి చేయాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సిద్దా రాఘవరావు : అధ్యక్షా, రాజమండ్రి వద్ద ఉన్న రైలు-కం-రోడ్డు బ్రిడ్జిని నేను పర్సనల్‌గా కూడా విజిట్ చేయడం జరిగింది. అప్పుడు సంబంధిత అధికారులను, ఇఎన్‌సిని కూడా పిలిపించాను. వాస్తవంగా, అది మొదటినుంచి కూడా hanging design. అయినప్పటికీ దానిలో సంవత్సరాల తరబడి ఉన్న లోపాలతోపాటు రైల్వే శాఖ యొక్క సహకారం కూడా లేకపోవడం వంటి కొన్ని ఇబ్బందులు వచ్చాయి. అది మెయిన్ లైన్ కావడం వల్ల ట్రైన్స్ ఆపడం కుదరదని రైల్వే శాఖ వారు పదే, పదే చెప్పడం జరిగింది. దీని మీద సచివాలయంలో కూడా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి రైల్వే జనరల్ మేనేజర్, ముఖ్య కార్యదర్శి, ఇఎన్‌సీ మొదలైన వారితో డిస్కస్ చేయడం జరిగింది. మద్రాసుకు చెందిన స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ మరియు రీసెర్చ్ కంపెనీ వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్క్ చేయడానికి సిద్ధమయ్యారు. తరువాత రీసెంట్‌గా జరిగిన సమావేశంలో మెట్కో, కలకత్తా వారి సజెషన్స్ తీసుకొని దాని మీద ముందుకు వెళదామని చెప్పి రైల్వే శాఖ జి.ఎం గారు కూడా ఒప్పుకోవడం జరిగింది. రేపు ఉదయం మెట్కో కంపెనీ వారు రాజమండ్రి రాబోతున్నారు. వారి ఒపినియన్ తీసుకొని, ఏ విధంగా చేయాలనే ఆలోచనతో ముందుకు వెళతామని తెలియజేస్తున్నాను. ఏదేమైనప్పటికి వచ్చే జూన్‌లో పుష్కరాలు వస్తున్నాయి కాబట్టి గౌరవ సభ్యులు చెప్పినట్లు ప్రభుత్వం కూడా అదే ఆలోచనలో ఉంది. ముఖ్యమంత్రి గారు కూడా దానిని వెంటనే తగిన చర్యలు తీసుకొని క్లియర్ చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దానితో పాటు కొత్తగా కడుతున్న బ్రిడ్జిని కూడా నేను విజిట్ చేయడం జరిగింది. అధికారులను తరచుగా అంటే ప్రతి 15 రోజులకు ఒకసారి కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి అక్కడికి పంపిస్తున్నాము. మార్చి నాటికి ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ఓపెన్ చేయడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. దానిని ఓపెన్ చేసిన తరువాత ఈ బ్రిడ్డి మీద concentration పెట్టడం జరుగుతుంది. రైల్వే శాఖ వారైతే రోజుకు 4 గంటలు మాత్రమే ఆపగలం. దానికి మించి ఎక్కువ సేపు ఆపడానికి వీలు లేదని చెబుతున్నారు. వీళ్లను, వాళ్లను కూర్చోబెట్టి కోఆర్డినేట్ చేసుకొని శాశ్వత పద్ధతిలో మరమ్మతులు చేయించడానికి ఆలోచించి ముందుకు వెళతాం. అన్ని విధాల ఆలోచించి, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఆ బ్రిడ్జిని కొంతకాలం అంటే రిపేర్ చేసేంతవరకు 24 గంటలు కూడా హెవీ వెహికల్స్ కాని, లారీలు కాని అటు పోకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు డిపార్ట్‌మెంట్‌కు కూడా ఆదేశాలు ఇచ్చి, పుష్కరాలు వచ్చే సమయానికి బ్యూటిఫికేషన్ గాని, రైలింగ్‌ను కాని, బిటీ లేయర్‌ను కాని పూర్తి చేయడానికి, ట్రాన్స్‌పోర్ట్‌కు ఇబ్బంది లేకుండా పకడ్బందీగా, శాశ్వతంగా ఉండేటట్లు చేయడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : రాఘవరావు గారూ.. ఇంకొక అంశం. మీరు Transport, Roads & Buildings శాఖను నిర్వహిస్తున్నారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడిన తరువాతనే రీసెంట్‌గా అంటే 22 జూన్, 2014వ తేదీన ఒక ఫంక్షన్ నిమిత్తం ఓర్వకల్ మండల తహశీల్దార్ - కలెక్టర్‌ను రిసీవ్ చేసుకోవడానికి వెయిట్ చేస్తుంటే వారు నిలుచున్న ప్రదేశానికి ఒక ఇసుక లారీ వచ్చి ఆమె బాడీ మీదగా వెళితే ఆ లేడీ తాహశీల్దార్ చనిపోయే పరిస్థితులలో ఆమెను కర్నూలు జనరల్ ఆసుపత్రికి తీసుకెళితే ఆమె బ్రతికింది. ఆ ప్రమాదానికి కారణం రోడ్డు డిఫెక్టా లేక ఇసుక లారీదా? అక్కడ టర్నింగ్ కూడా కొద్దిగా ఉంది. అక్కడకు వెళ్లి నేను చూశాను. అ ప్రమాదంలో నలుగురు చనిపోతే, అదృష్టం కొద్దీ ఆమె బ్రతికింది. ఈ విషయం రెవెన్యూ మంత్రి గారికి కూడా తెలుసు.

శ్రీ సిద్ధా రాఘవరావు : అధ్యక్షా, ఈ విషయం నా దృష్టికి రాలేదు. అధికారుల దగ్గర సమాచారం తెప్పించుకొని అక్కడ రోడ్డు డిఫెక్ట్ ఉంటే దానిని సరిదిద్దడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ బి.చంగల్ రాయుడు : అధ్యక్షా, రాజమండ్రి బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు జరిగింది? దాని మీద టోల్‌గేటు వసూలు చేశారా, చేసి ఉంటే ఎంత వసూలైంది అని అడిగిన దానికి మంత్రి గారి నుండి సమాధానం రాలేదు.

శ్రీ సిద్ధా రాఘవరావు : అధ్యక్షా, ఈ రైలు–కం–రోడ్డు బ్రిడ్జి 1974లో నిర్మాణం జరిగింది. దీనిలో రైల్వే శాఖ maintenance ఉంది. టోల్‌గేటు వసూలు తదితర వివరాలు ప్రస్తుతం అందుబాటులో లేనందున తెప్పించి గౌరవ సభ్యులకు అందచేయడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడు సమయం గం.11.10 కావస్తోంది. ఇప్పుడు బిఏసీ ఉంది కాబట్టి మిగతా ప్రశ్నలను పోస్ట్‌పోన్ చేసుకుందామా? Shall I postpone the remaining questions?

శ్రీ బి.చంగల్ రాయుడు : అధ్యక్షా, క్వశ్చన్ అవర్ అయిపోనివ్వండి. Sir, the Question Hour is the privilege of the Member.

MR. CHAIRMAN : Mr. Changal Rayudu, do you want to continue the Question Hour?

శ్రీ బి.చంగల్ రాయుడు : అధ్యక్షా, మీరు రెండు కళ్లు చెబితే ఎలా? How it is possible? క్వశ్చన్ అవర్‌కు ప్రయార్టీనివ్వండి.

మిస్టర్ ఛైర్మన్ : సంతాప తీర్మానానికి కొంత సమయం పోయింది. ఓ.కె. I will go with the listed names. I will allow only one or two supplementaries. Now, I will take up third Question.

**సి.ఆర్.ఎఫ్. పథకం క్రింద రహదారులు**

**ప్రశ్న నెం.7805 (3)**
**శ్రీ మెట్టు గోవిందరెడ్డి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన రవాణా, రోడ్డు మరియు భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో సిఆర్ఎఫ్ నిధుల క్రింద చేపట్టిన పనులు నిలిచిపోయిన విషయం వాస్తవమేనా?
ఆ) అయితే, పురోగతిలో ఉన్న పనుల జిల్లా వారీ వివరాలు ఏమిటి?
ఇ) సదరు పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి (శ్రీ సిద్ధా రాఘవరావు):

అ) లేదండీ.

ఆ) పురోగతిలో ఉన్న జిల్లా వారీ పనుల వివరాలను అనుబంధం రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.

ఇ) నిర్ణీత ఒప్పంద గడువు లోపల పనులను పూర్తి చేయడానికి రెగ్యులరుగా పనుల పురోగతిని సమీక్షించడమవుతున్నది.

శాసన పరిషత్తు ప్రశ్న నెం. 7805 కు అనుబంధం

2013-14 సంవత్సరంలో 1వ దశ, 2వ దశలో జిల్లా వారీగా మంజూరైన సిఆర్ఎఫ్ పనుల స్థితి :

| వరుస సంఖ్య | జిల్లా పేరు. | మంజూరైన పనుల సంఖ్య | పురోగతిలో ఉన్న పనుల సంఖ్య | ఒప్పందం చేసుకోవలసి ఉన్నట్టి పనుల సంఖ్య | టెండర్లు / అంచనా ప్రక్రియలో ఉన్న పనుల సంఖ్య |
|---|---|---|---|---|---|
| 1. | శ్రీకాకుళం | 5 | 2 | 0 | 3 |
| 2. | విజయనగరం | 4 | 2 | 0 | 2 |
| 3. | విశాఖపట్టణం | 2 | 2 | 0 | 0 |
| 4. | తూర్పు గోదావరి | 3 | 2 | 0 | 1 |
| 5. | పశ్చిమ గోదావరి | 8 | 3 | 4 | 1 |
| 6. | కృష్ణా | 3 | 2 | 1 | 0 |
| 7. | గుంటూరు | 6 | 4 | 2 | 0 |
| 8. | ప్రకాశం | 3 | 2 | 0 | 1 |
| 9. | ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు | 4 | 2 | 1 | 1 |
| 10. | చిత్తూరు | 7 | 3 | 3 | 1 |
| 11. | కడప | 4 | 2 | 1 | 1 |
| 12. | అనంతపురము | 3 | 3 | 0 | 0 |
| 13. | కర్నూలు | 3 | 3 | 0 | 0 |
| | మొత్తం | 55 | 32 | 12 | 11 |

శిద్దా రాఘవరావు,
రవాణా, రోడ్లు & భవనాల శాఖ

శ్రీ మెట్టు గోవిందరెడ్డి (స్థానిక సంస్థలు, అనంతపురం) : అధ్యక్షా, మంత్రి గారి సమాధానంలో దాదాపు 55 పనులు మంజూరు చేయడం జరిగింది. దానిలో 32 పనులు నడుస్తున్నాయి. 12 పనులకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకోవలసి ఉందని తెలిపారు.

అయితే, 2012–13లో ఎంత ఖర్చు చేశారు, 2013–14లో, 2014–15లో ఎంత ఖర్చు చేశారు? కొత్త రాష్ట్రం ఏర్పడింది కాబట్టి అనంతపూర్ జిల్లా నుండి విజయవాడకు రోడ్డు సరిగా లేదు. ఇప్పుడు కేంద్రంలో కూడా మనకు అనుకూలమైన ప్రభుత్వం ఉంది కాబట్టి సాధ్యమైనంత ఎక్కువ నిధులను రాబట్టి రాష్ట్రానికి, కాపిటల్ సిటీకి ఎక్కువ నిధులను తీసుకువచ్చే ప్రయత్నం ఏమైనా చేస్తారా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : ఇప్పుడు సమయం ఉ.11.10 కావస్తోంది. ఇప్పుడు బిఏసీ ఉంది కాబట్టి క్వశ్చన్ అవర్‌ను కంటిన్యూ చేద్దామా లేక బ్రేక్ ఇద్దామా?

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, మీరు బిఏసీ సమావేశం టైం చెప్పారు. దీనికి ముఖ్యమంత్రి గారు కూడా రావాలని చెప్పారు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం ఇప్పుడు ముఖ్యమంత్రి గారు అక్కడ జరిగే బిఏసీలో ఉన్నారు కాబట్టి ముఖ్యమంత్రి గారు ఎప్పుడు ఫ్రీ అవుతారనే సమాచారాన్ని మీరు తెప్పించుకుంటే అప్పుడు మనం బిఏసీని పెట్టుకోవచ్చు. అప్పటి వరకు మనం క్వశ్చన్ అవర్‌ను కంటిన్యూ చేసుకుందాం. అధ్యక్షా, క్వశ్చన్స్‌లో సప్లమెంటరీలను అడగనివ్వండి. లేకపోతే దానికి అర్థమే ఉండదు.

## గిడ్డంగుల కొరత

**ప్రశ్న నెం.7729 (4)**
శ్రీ అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ధరల పర్యవేక్షణ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో ధాన్యాన్ని నిలవచేయడానికి గోదాముల కొరతగా ఉన్న విషయం వాస్తవమేనా?
ఆ) వివిధ సంస్థల క్రింద గల గోదాముల సామర్థ్యం ఎంత?
ఇ) సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్య లేమిటి?

గౌరవనీయులైన ధరల పర్యవేక్షణ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి (శ్రీమతి పరిటాల సునీత):

అ) లేదండి.
ఆ) వివిధ సంస్థల క్రింద గల గోదాముల వివరాలు ఈ క్రింద విధంగా ఉన్నాయి.

| **సంస్థ** | | **సామర్థ్యం (లక్షల మెట్రిక్ టన్నులలో)** |
|---|---|---|
| ఎపిఎస్‌డబ్ల్యుసి(స్వంతం) | – | 7.18 |
| (కిరాయికి తీసుకున్నవి మరియు పెట్టుబడిదారు) | – | 14.12 |

| | | |
|---|---|---|
| సిడబ్ల్యుసి | – | 7.85 |
| ఎఫ్‌సిఐ | – | 7.28 |
| ఎపిఎస్‌సిఎస్‌సిఎల్ | – | 2.23 |
| **మొత్తం** | **–** | **38.66** |

సి) ప్రస్తుతానికి ఎటువంటి నిల్వ సమస్యలేదు. ప్రభుత్వ ఏజెన్సీలు కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మరపట్టించి, బియ్యాన్ని బట్వాడా చేయాలని సూచిస్తూ రైసు మిల్లులకు తరలించడం జరుగుతున్నది.

శ్రీ అంగర రామమోహన్ (స్థానిక సంస్థలు, పశ్చిమ గోదావరి) : అధ్యక్షా, తెలుగుదేశం ప్రభుత్వం గాని, ముఖ్యమంత్రి గారు గాని రైతులకు సంబంధించి చాలా గొప్ప చర్యలు తీసుకుంటూ రైతులకు మేలు జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషిస్తున్నాను. దురదృష్టవశాత్తు, గత ప్రభుత్వ హయాంలో గోదాముల నిర్మాణం చాలా అసంపూర్తిగా మిగిలిపోయాయి. నిర్మాణం జరిగిన చోట్ల కూడా కొన్ని జిల్లాలలో అవకతవకలు జరిగాయి. వాటిపై విచారణ జరిపించి, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తూ, ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీమతి పరిటాల సునీత : అధ్యక్షా, ఏవైనా అసంపూర్తిగా ఉన్న గోదాముల విషయం మా దృ ష్టికి వస్తే వాటిని పూర్తి చేస్తామని గౌరవ సభ్యులకు ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, రామమోహన్‌రావు గారూ మాట్లాడుతూ అసంపూర్తిగా గోదాముల నిర్మాణం ఉందని చెప్పారు. అవి ఎక్కడ ఉన్నాయో ఒకటి, రెండు సంఘటనలు చెబితే తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి గారు అంటున్నారు కాబట్టి వాటి గురించి సభ్యులు చెబితే, దాని మీద మంత్రి గారి సమాధానం కూడా వినాలని మాకు ఉంది.

శ్రీ అంగర రామమోహన్ : అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో గోదాముల నిర్మాణంలో చాలా లోపాలున్నాయని, చిత్తూరు మార్కెటు యార్డులో గోదాముల నిర్మాణంలో కూడా చాలా అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తే దాని మీద గతంలో ఎస్.ఈ గారు విచారణ జరిపారు. ఆ విచారణలో ఏమైనా అవినీతి బయటపడిందా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీమతి పరిటాల సునీత : అధ్యక్షా, ఒక్క చిత్తూరు జిల్లాలోనే కాకుండా మొత్తం 13 జిల్లాలలో ఎక్కడైనా గోదాముల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నట్లు ప్రభుత్వ దృష్టికి వస్తే తప్పకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అదే విధంగా మార్కెట్ యార్డు గోదాముల నిర్మాణం గురించి కూడా చెబుతున్నారు కాబట్టి వాటి పైన కూడా పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## విశాఖపట్నం జిల్లాలో మత్స్యకారుల సమస్యలు

**ప్రశ్న నెం.7721(5)**
**శ్రీ అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విశాఖపట్టణంలోని చేపలు పట్టే ఓడరేవులో సదుపాయాలు లేని కారణంగా మత్స్యకారులు ఇబ్బందికి గురవుతున్నారా?

ఆ) అయితే, ఓడరేవులో సదుపాయాలను సమకూర్చడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ, పశుసంవర్థన, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు) :

అ) అవునండీ.

ఆ) విశాఖపట్టణంలోని చేపల ఓడరేవు విశాఖపట్టణం పోర్టు ట్రస్టు (విపిటి) యాజమాన్య నియంత్రణ క్రింద ఉన్నందున, మత్స్యకారులకు అత్యవసర సదుపాయాలను సమకూర్చాలని వారిని కోరడమయింది.

శ్రీ అంగర రామమోహన్ : అధ్యక్షా, ఇటీవల సంభవించిన హుద్‌హుద్ తుఫాను వల్ల మత్స్యకారుల యొక్క పడవలు, వలలు అన్ని దెబ్బతిన్నాయి. వాళ్లు ఆర్థికంగా చాలా దెబ్బ తిన్నారు. మత్స్యకారుల ద్వారా చాలా పెద్ద ఎత్తున దాదాపు రూ.3000కోట్లు విదేశీ మారక ద్రవ్యం కూడా ప్రభుత్వానికి వస్తుంది కనుక వారికి సరైన సదుపాయాలు కల్పించి పెద్ద ఎత్తున ఆదుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, దీని మీద ఒక అస్యూరెన్స్‌లో హౌస్‌లో వచ్చి ఉంటే పోర్టు ట్రస్టుకు వెళ్లాను. వాళ్లు కొంత అమౌంట్‌ను కూడా మంజూరు చేస్తూ వాళ్లే టేకప్ చేస్తామని చెప్పారు. ఈ విషయమై పోర్టు ట్రస్టులో ఒక మీటింగును ఏర్పాటు చేసి డిస్కస్ చేయడం జరిగింది. ఆ మినిట్స్ కూడా మన సెక్షన్‌లో ఉన్నాయి. Already, it has been approved by the House. When it is going to be implemented by the Port Trust? ఒకసారి మంత్రి గారు రెవ్యూ చేసి తగిన చర్యలు తీసుకుంటే అక్కడున్నటువంటి ఫిషరీస్ కమ్యునిటీ అంతా బాగా అభివృద్ధి చెందడానికి వీలుంటుందని మీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీమతి బలశాలి ఇందిర (నామినేటెడ్) : అధ్యక్షా, ఏదైనా నాచురల్ కలామిటీ వచ్చినప్పుడు ఎక్కువగా నష్టపోయేది తీరప్రాంతం. దానిలో కూడా ఆ తీరప్రాంతాన్ని ఆనుకొని నివసిస్తున్న మత్స్యకారులే ఎక్కువగా నష్టానికి గురవుతుంటారు. మొన్న వచ్చిన హుద్‌హుద్ తుఫాను ప్రభావం వల్ల లక్షల మంది మత్స్యకారులు నిరాశ్రయులయ్యారు. వాళ్లకు సంబంధించిన ఫిషింగ్ సామాగ్రినంతటిని నష్టపోవడం జరిగింది. ముఖ్యంగా, ఫిషింగ్ హార్బర్‌లో 64 పెద్ద బోట్లు మునిగిపోతే వాటిల్లో 59 మాత్రం బయటకు తీసి పెట్టడం జరిగింది. ప్రభుత్వం కూడా వారికి

నష్టపరిహారం ప్రకటించడం జరిగింది. అయితే, ఒక్కొక్కటి రూ.25-27లక్షల ఖరీదు చేసే బోట్లకు రూ.6లక్షలు నష్టపరిహారంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ నష్టపరిహారం ఇవ్వాలంటే పాత బోట్లను మాకు హ్యాండోవర్ చేయమని ప్రభుత్వం అడుగుతుంది. ఇది సమంజసం కాదు. ఎందుకంటే ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం వాటిని మరమ్మతులు చేసుకోవడానికి సరిపోతుంది తప్ప కొత్త వాటిని కొనుగోలు చేయడానికి సరిపోదు కాబట్టి నష్టపరిహారాన్ని ఇంకా పెంచాలి. అలాగే, ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని వీలైనంత తొందరగా ఇంప్లిమెంట్ చేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఉ. 11.20

అధ్యక్షా, ఈ ఫిషరీస్ శాఖ మత్స్యకారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నది. ఈ విషయాన్ని మేము గతంలో నుండి చూస్తున్నాము. ముఖ్యంగా నేను ఈ ప్రభుత్వాన్ని కోరేదేమంటే, అధికారుల విషయంలో హై లెవల్నుండి ప్రక్షాళన చేసుకుంటే తప్ప ఎన్ని పథకాలు పెట్టినప్పటికీ క్రింద స్థాయి వారికి అందుబాటులోకి వెళ్లవని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. అటువంటి చర్యలేమైనా తీసుకునే అవకాశం ఉన్నదా అని ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, శ్రీ అంగర రామమోహన్ గారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని తెలియచేస్తున్నాను. అదే విధంగా సభ్యులు శ్రీ బి. చంగల్ రాయుడు గారు ప్రశ్న అడిగారు. అందుకు సంబంధించి డెవలప్మెంట్కు కమిటీ వేశారు, దానిని ఒకసారి సమీక్ష చేసి కేటాయించిన నిధుల విషయమై వెంటనే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మేము దానిని ఫాలో అప్ చేస్తున్నాము. గౌరవ సభ్యురాలు శ్రీమతి బలశాలి ఇందిర గారు కూడా అడిగారు. హుద్హుద్ తుఫాను కారణంగా రూ.6 లక్షలు పూర్తి స్థాయిలో డామేజికి, పాక్షిక డామేజికి రూ.3 లక్షలు చొప్పున ప్రభుత్వం ప్రకటించింది. సుమారు రూ.17కోట్ల 6 లక్షలు రిలీఫ్ కోసం అంచనా వేయడం అందుకు నిధులు కేటాయించడం జరుగుతుంది. పాడైపోయిన బోట్లు గురించి సుమారు రూ.6 లక్షలు ఇస్తున్నాము. మత్స్యకారులను ఆదుకోవడానికి గాను 55 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు రూ.1000లు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మత్స్యకారులకు అనుకూలంగా ఉండే విధంగా ఫిషింగ్ హార్బర్లో యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకుని, వారికి మెరుగైన జీవన విధానాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది.

MR. CHAIRMAN: Now, I will take up Question No.7808 (6).

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ఈ అంశంపై మేము స్ట్రక్చరల్ డిస్కషన్ చేయాలని అనుకుంటున్నాము. కాబట్టి, ప్రశ్నగా కాకుండా దీనిపై వివరంగా చర్చిస్తే బాగుంటుందని అనుకుంటున్నాము.

MR. CHAIRMAN: Ramachandraiah garu let the Question be cleared. Already, it has come before the House. Now, how can I stop it.

Sri C. RAMACHANDRAIAH: You can postpone it Sir.

MR. CHAIRMAN: Let the answer come first.

శ్రీ సి. రామచంద్రయ్య : ప్రభుత్వం కూడా దీనిమీద పాలసీ స్టేట్‌మెంట్ చేయబోతోంది. కాబట్టి, దీనిపై వివరంగా చర్చిస్తే బాగుంటుంది.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: ముఖ్యమంత్రిగారు సభలో స్టేట్‌మెంట్ ఇవ్వబోతున్నారు. సభ్యులు ఎలా అంటే అలాగే చేద్దాము. మాకేమీ అభ్యంతరం లేదు. అయితే, ఈ ప్రశ్నలో వ్యవసాయ రుణాలు ఎంతమందికి ఇచ్చారు అనేటటువంటిది ఉన్నది. ప్రశ్నను పోస్ట్‌పోన్ చేసినా మాకు అభ్యంతరం లేదు, స్ట్రక్చరల్ డిస్కషన్‌కైనా మాకు అభ్యంతరం లేదు. సభ్యులు ఎలా కోరుకుంటే అలా చేస్తాము.

MR. CHAIRMAN: Ramachandraiah garu wants to postpone the question. So, Question No. 7808(6) is postponed at the request of the Member.

శ్రీ సి. రామచంద్రయ్య : ఈ ప్రశ్నపై ముందు మంత్రిగారు సమాధానం ఇస్తామన్నా మాకభ్యంతరం లేదు, తరువాత డిస్కస్ చేద్దామన్నా మాకభ్యంతరం లేదు. Minister is prepared to answer the question.

MR.CHAIRMAN: Before that, I have postponed the question Ramachandraiah garu.

SRI C. RAMACHANDRAIAH: So, I leave it to the Chair. Whatever the decision you will take that is binding on us Sir.

MR. CHAIRMAN: Yesterday night itself, you might have circulated it. Moreover, the Minister is on his legs.

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి : ఈ ప్రశ్నను మరో రూపంలో తీసుకువస్తే, సభలో విపులంగా చర్చించవచ్చు.

శ్రీ సి. రామచంద్రయ్య : సార్, మన ఆఫీస్ సెక్రటేరియట్ వాళ్లకు ఇటువంటి విషయాలు వచ్చినప్పుడు రెండూ కలిపి పెడదామనే ఆలోచన ఉండాలి. వాళ్లు ఆ విధంగా చేయకుండా అక్కడ అడ్మిట్ చేశారు. This is such an important issue. Both are important subjects. Minister wants to give reply, we have no objection.

MR. CHAIRMAN: Question Nos.7808 (6) and 7631 (7) are postponed at the request of the Member.

## రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో దేవాలయాల ఆధునికీకరణ

ప్రశ్న నెం. 7668 (8)
సర్వశ్రీ బి. చంగల్ రాయుడు, రుద్రరాజు పద్మరాజు, ఎం.ఎల్.సి.లు

గౌరవనీయులైన దేవాదాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాబోయే గోదావరి పుష్కరాల కోసం రాజమండ్రి చుట్టు ప్రక్కల గల గ్రామాలలోని ప్రముఖ పురాతన దేవాలయాల ఆధునికీకరణ కోసం మరియు మౌలిక సదుపాయ సౌకర్యాలను విస్తరించడానికి ప్రభుత్వం వద్ద ఏవేని ప్రతిపాదనలు ఉన్నాయా?

ఆ)　అయితే, వీటి కోసం కేటాయించే నిధుల వివరాలేమిటి?

గౌరవనీయులైన దేవాదాయ శాఖ మంత్రి గారు (శ్రీ పైడికొండల మాణిక్యాల రావు):

అ)　అవునండీ.

ఆ)　దేవాలయాలు / సత్రాలను (237 పనులు) మెరుగు పరచడం / నవీకరించడం / నిర్మించడం కోసం కామన్ గుడ్ ఫండ్ (సిజిఎఫ్) క్రింద దేవాలయాల శాఖ రూ.23.31 కోట్ల మొత్తాన్ని కేటాయించింది. మొదటి దశగా ప్రధాన జిల్లా రోడ్లు మరియు కోర్ నెట్ రోడ్లు (37 పనులు) కోసం రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ రూ.144.83 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది.

రాబోయే 2015, గోదావరి పుష్కరాల కోసం మొదటి దశగా రూ.371.83 కోట్ల అంచనాతో రాజమండ్రి చుట్టు ప్రక్కల గల పంచాయతీలు, మునిసిపాలిటీలు, గ్రామాలలో పారిశుద్ధ్యం, విద్యుత్తు, లింకు రోడ్లు, బ్యారికేడ్లు మరియు నీటి సరఫరా కోసం ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, కామన్ గుడ్ ఫండ్ క్రింద వైష్ణవ ఆలయాలు, శివాలయాల నుండి డబ్బు తీసుకున్నారు. అఖండ గోదావరి వెలుగులు వెలగడానికి ప్రభుత్వం ఈ పని చేసింది. కోటి తీర్థాల కలయిక గోదావరి కాబట్టి, అన్ని తీర్థాలు గోదావరిలో కలుస్తాయి. అందువల్ల ప్రభుత్వం మంచి పనే చేసింది. కానీ, అందులో ఎంత మందిని ఇన్‌వాల్వ్ చేసింది? అన్ని పార్టీలతో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసి, సమీక్ష చేయవలసిన అవసరం ఉన్నది. మనకు 2004వ సంవత్సరంలో కృష్ణా పుష్కరాలు వస్తే, పక్క రాష్ట్రం నుండి శ్రీ ధరమ్ సింగ్ గారు ఒక్క లీటరు నీటిని కూడా వదలమని చెప్పారు. దైవానుకూలత వల్ల మనకు రాత్రికి రాత్రి వర్షం కురవడంతో ఆలమట్టి నుండి నీళ్లు కృష్ణాకు వచ్చి మనకు పుష్కరాలకు ఇబ్బంది లేకుండా జరిగింది. ఇది అందరినీ కలుపుకుని వెళ్లే కార్యక్రమం అని ప్రభుత్వ దృష్టికి తీసుకు వస్తున్నాను. కామన్ గుడ్ ఫండ్ నుండి తీసుకున్నప్పుడు అన్ని పార్టీలను ఇన్‌వాల్వ్ చేయవలసిన బాధ్యత ఉన్నది. కొత్తగా తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత మనకు వచ్చిన 7 మండలాలలో కొన్ని పెద్ద దేవాలయాలు, కొన్ని గిరిజన దేవాలయాలు ఉన్నాయి. వాటి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు మాకిచ్చిన నివేదికలో కనబడ లేదు. గోదావరి నుండి మనం వెడుతుంటే మనం మొదట చూసే దేవాలయం పేరంటాలపల్లి. అది గిరిజనుల దేవాలయం. దానిని ఎక్కడా మెన్షన్ చేసినట్లు కనబడలేదు. 7 మండలాలలో కలిసి దాదాపు 18 దేవాలయాలు ఉన్నాయి. వాటిని గురించి ప్రభుత్వం ఏమైనా వర్కవుట్ చేస్తున్నదా? టూరిజం కారిడార్‌గా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనతో ఉన్నప్పుడు రాజమండ్రికి చేరువలో ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ఎన్ని కిలోమీటర్ల పరిధిలో దేవాలయాలను చూడగలుగుతున్నాము, వాటికి సంబంధించిన లిటరేచర్‌ను ఏ విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలుగుతున్నామనే అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఆయా దేవాలయాల పుట్టుపూర్వోత్తరాల గురించిన వివరాలు పెట్టగలిగితే బాగుంటుంది. అటువంటి ప్రతిపాదన ఏమైనా ప్రభుత్వం దగ్గర ఉన్నదా? నేరుగా వచ్చి గోదావరిలో మునిగి వెళ్లిపోకుండా, చుట్టు పక్కల ఉండే ఊళ్లు, అక్కడ దేవాలయాలను ప్రజలు సందర్శిస్తారు. అమలాపురం, కాకినాడ, ద్రాక్షారామం, కోటిలింగాల రేవు వంటి వాటికి వెళ్లడానికి ప్రభుత్వం ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తున్నది? నిన్నం కొట్టి గోదావరి పుష్కరాలు ప్రారంభమైనాయని చెప్పడం కాకుండా, వీటిపై

వివరంగా అధ్యయనం చేయాలి. ఇంతకుముందు ఆర్ అండ్ బి మంత్రిగారు 15 రోజులకొకసారి సమావేశం ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి కూడా వీలైతే సంబంధిత మంత్రిగారు వారానికి ఒకసారి సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందని నేను భావిస్తున్నాను. గోదావరి చుట్టుపక్కల, కొత్తగా వచ్చిన 7 మండలాలలో మొత్తం ఎన్ని దేవాలయాలు ఉన్నాయి? వాటిల్లో చేపట్టే పనులు ఏమిటి, ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారని నేను ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. దాదాపు రూ.130 కోట్లు పుష్కరాలలోపు ఖర్చు పెడతామని ఆర్ అండ్ బి శాఖ మంత్రిగారు చెబుతున్నారు. ఆ సొమ్మును సున్నం వేయడానికి, టాయిలెట్లు బాగుచేయడానికి, కొత్త ఘాట్లు కట్టడానికి ఏమి చర్యలు తీసుకున్నారు, పాత చరిత్ర ఏమి చెబుతున్నది అనే అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం చేయవలసి ఉన్నది.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : వేదంలా ఘోషించే గోదావరి, అమర ధామంలా విలసిల్లే రాజమహేంద్రి అనే విషయం మనకు తెలుసు. పుష్కరాలకు రాజమండ్రికి ఉన్న అవినాభావ సంబంధం దృష్ట్యా ఆ చుట్టుపక్కల ఉండే చారిత్రాత్మక, ఆధ్యాత్మిక కట్టడాలకు ప్రాధాన్యతనివ్వవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా పుష్కరాలు రావడం జరుగుతున్నది. అది యాదృచ్ఛికమే కావచ్చు, మరేదైనా కావచ్చు. ఏదైనా ఇది ఒక మంచి కార్యక్రమం కాబట్టి, దీనికి రాజమండ్రి పరిసరాలకే పరిమితం కాకుండా మరెన్నో చారిత్రక కట్టడాలను కూడా ఈ సందర్భంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది. సారంగేశ్వర ఆలయం, ధవళేశ్వరంలో జనార్ధన స్వామి ఆలయం, కోరుకొండ ప్రాంతంలో ఉన్న కంకికొండ, కనుకూరు గ్రామాలలో ప్రముఖ దేవాలయాలున్నాయి. రంపా శివాలయాన్ని క్రీస్తు శకం 14వ శతాబ్దంలో నాగవంశీయులు నిర్మించారనే ఆధారాలున్నాయి. ఇది ముఖ్యంగా గిరిజనులకు సంబంధించిన శివాలయం. వీటిని అభివృద్ధి చేయాలి. రాయదుర్గం కోటను కూడా అభివృద్ధి చేయవలసిన అవసరం ఉన్నది.

ఉ.11.30

అదేవిధంగా, రాయదుర్గం కోటను కూడా అభివృద్ధి చేయవలసిన ఉంది. మరీముఖ్యంగా చూసినట్లయితే, హోంశాఖా మంత్రిగారి ప్రాంతమైన అమలాపురంలో మందపల్లి, రామఘట్టం, రాలీ వంటి ప్రాంతాల్లో చాలా చక్కని నిర్మాణాలున్నాయి. అంతర్వేది అనే పుణ్యక్షేత్రం గురించి కూడా మనందరికీ తెలుసు. అక్కడ ఈ మధ్య కాలంలో చాలా చక్కని కార్యక్రమాలు చేస్తూ ఉన్నారు. అక్కడున్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మీరు కూడా సందర్శించారు. అటువంటి దేవాలయాలను అభివృద్ధి చేయడమనేది ఒక సువర్ణావకాశమని నేను తెలియజేస్తున్నాను. మంత్రిగారు ఆ ప్రాంతాలకు సమీపంలో ఉన్న తాడేపల్లిగూడెం వాస్తవ్యులు కాబట్టి వారికి వీటన్నింటి గురించి చాలా బాగా తెలుసు. అందువల్ల ఈ దేవాలయాన్నింటిపై వారు ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి.

మందపల్లిలో శనేశ్వరాలయం, మొరమాళ్లలో భద్రకాళి ఆలయం, సామర్లకోటలో పంచారామాలలోని భీమేశ్వరాలయం ఉన్నాయి. 100 సంవత్సరాల క్రితం నుంచి మాఊరు సఖినేటిపల్లిలో ఉన్న భీమేశ్వరాలయానికి కొన్ని ప్రభుత్వ నిధులు తీసుకుని మా నిధులను కూడా కలిపి ఖర్చు చేయడం జరిగింది. ఏదో నగరానికి చుట్టుప్రక్కల ఉన్న దేవాలయాలను మాత్రమే కాకుండా గిరిజనులకు సంబంధించిన ఆలయాలకు కూడా రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా నేను ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా, రాష్ట్రవిభజన జరిగిన తర్వాత ఖమ్మం జిల్లా నుంచి మనరాష్ట్రానికి కలిపినటువంటి ఏడు మండలాలకు సంబంధించి పేరంటాలపల్లిలో ఒక గిరిజన దేవత ఆలయం ఉంది. భద్రాచలం స్వామివారి దర్శనం చేసుకోక ముందు భక్తులు ఈ అమ్మవారిని దర్శనం చేసుకునే ఆనవాయితీ ఉంది. అదేవిధంగా, నెల్లిమర్లలోని రామగిరి దేవాలయాన్ని కూడ అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఉందని తమరిద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను. Let us not only confine to the Towns and Cities. Let us go to the distant places where Tribals and Weaker Sections are living. ఈ విధంగా దేవాదాయ శాఖకు చాలా ఆదాయం వస్తోంది. ఆ ఆదాయాన్ని సరైన విధంగా ఖర్చు చేసినట్లయితే ప్రజలంతా కూడా హర్షిస్తారు. రాబోయే పుష్కరాలు మంచి సువర్ణావకాశం కాబట్టి వీటి పనులకు సంబంధించి ప్రతిపక్షనాయకుల సూచనలు, సలహాలు కూడా తీసుకోవాలని నేను తమరిద్వారా ప్రభుత్వానికి మనవిచేస్తున్నాను. సఖినేటిపల్లికి చెందిన భీమేశ్వరాలయానికి, అంతర్వేదిలో ఉన్న లక్ష్మీనరసింహ దేవాలయానికి, మందపల్లిలో ఉన్న శనేశ్వరాలయానికి కూడా మరిన్ని ప్రభుత్వ నిధులను కేటాయించి అభివృద్ధి చేయడం ద్వారా ఆ ఆలయాలకు ఒక ప్రత్యేక ప్రతిపత్తిని, గౌరవాన్ని కల్పించాలని ఈ సందర్భంగా నేను ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను. మనరాష్ట్రం నుంచేకాక, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు కాబట్టి ఈ దేవాలయాలన్నింటినీ అభివృద్ధిచేసే రీతిలో ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా తమరిద్వారా నేను మనవిచేస్తున్నాను.

MR. CHAIRMAN: Minister garu, have a meeting with the Legislators. So that, you can get views and valuable suggestions from the Members.

శ్రీ పైడికొండల మాణిక్యాల రావు: అధ్యక్షా, మీరు మరియు గౌరవ సభ్యులు సూచించిన విధంగా తప్పనిసరిగా ఒక సమావేశాన్ని నిర్వహించి వారి సలహాలు మరియు సూచనలు తీసుకుంటాము.

శ్రీ బి.చంగల్ రాయుడు: (మైకు లేకుండా) రాజమండ్రిలోనే పెట్టండి సార్.

శ్రీ పైడికొండల మాణిక్యాల రావు: అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినట్లు కేవలం రాజమండ్రి అర్బన్‌లోనే కాక ఉభయగోదావరి జిల్లాల్లో కలిపి మొత్తం 327 దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నాము. తూర్పుగోదావరి జిల్లాలో 138 దేవాలయాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 189 దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నాము. అలాగే, మన రాష్ట్రంలో కలిసిన ఏడు మండలాల్లో రూ. 91.50 లక్షలతో పది దేవాలయాలను అభివృద్ధి పరచాలని, 6 స్నానఘట్టాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. గౌరవసభ్యులు శ్రీ ఆర్.పద్మరాజుగారు సూచించినట్లు సఖినేటిపల్లి భీమేశ్వరాలయం అభివృద్ధి గురించి కూడా తప్పనిసరిగా పరిశీలించి అభివృద్ధి చేస్తాము.

## వివిధ పరిశ్రమలకు చేసిన భూమి కేటాయింపులు

ప్రశ్న నెం. 7796(10)
శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఇంతకుమునుపు పరిశ్రమలకు చేసిన భూ కేటాయింపులను రద్దు చేసే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఆ) అనంతపురము జిల్లాలో లేపాక్షి నాలెడ్జి హబ్‌కు 8840 ఎకరాల భూమిని కేటాయించడంలో కొన్ని అక్రమాలు చోటుచేసుకున్న విషయం వాస్తవమేనా?

ఇ) అయితే, వీటిపై తీసుకున్న చర్య ఏమిటి?

ఈ) వారు 15 శాతం సర్వీసు ఛార్జీలను వసూలు చేయవలసి ఉన్నప్పటికీ, వారు 2 శాతం మాత్రమే సర్వీసు ఛార్జీలను వసూలు చేసినందున ప్రభుత్వానికి రూ.15.19కోట్లు నష్టం వాటిల్లిందా? ఈ విషయంలో నష్టాన్ని పూరించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఉపముఖ్యమంత్రి (రెవెన్యూ) ( శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి):

అ) అవునండీ.

ఆ) అవునండీ. ఏ ప్రయోజనం కోసం ఉద్దేశించిన భూమి కేటాయించబడిందో ఆ భూమి అందుకు వినియోగించలేకపోయినా, నిర్దేశించిన నిబంధనలు పాటించకపోయినా అట్టి భూమిని స్వాధీనం చేసుకునే ఆలోచన ప్రభుత్వానికుంది.

ఇ) 28-06-2014 తేదీగల ప్రధాన పరిపాలన (మంత్రిమండలి) శాఖ, జి.ఓ.ఆర్.టి. నెం.2421 ద్వారా గౌరవ ఆర్థిక శాఖా మంత్రిగారి అధ్యక్షతన మంత్రుల ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం " అవినీతి నిర్మూలన, ప్రభుత్వ ఆస్తులు మరియు రాబడుల సంరక్షణ" ఉద్దేశించబడింది. అనంతపురం జిల్లాలోని లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం కేటాయించిన భూమి విషయం కూడా ఈ కమిటీ పరిశీలిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ఈ) అవునండీ, ఈ విషయం కూడా మంత్రివర్గ ఉపసంఘం పరిశీలనలో ఉంది. వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి : అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ఎందుకంటే, ఆనాడు బోర్డు ఆఫ్ డైరక్టర్ల సమావేశంలో ఈ భూమిని కేటాయించడం జరిగింది. దీనిపై బ్యాంకులో దాదాపు రూ. 890 కోట్లు లోనుగా తీసుకోవడం జరిగింది. ఆ మొత్తం ఎలా రికవర్ చేయాలనేది కమిటీ నిర్ణయిస్తుంది. ఆ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాము.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, ఈ నాలెడ్జ్ హబ్ అనేది అనంతపురం జిల్లాలోనే ఉంది. పేద రైతుల వద్ద నుంచి కూడా చాలా భూమిని అప్పటి ప్రభుత్వం తీసుకోవడం జరిగింది. గౌరవ మంత్రిగారు దానిపై ఒక కమిటీని నియమించారని చెప్పారు. పేద రైతుల నుంచి సేకరించిన భూమిని తిరిగి పేదరైతులకు ఇవ్వడం జరుగుతుందా? రుణాలు ఇచ్చిన బ్యాంకులపై మీరు ఏమైనా చర్యలు తీసుకుంటారా? ఛార్జ్‌షీట్ ఉన్న నిందితులు కూడా బెయిల్‌పై బయటకు వచ్చి కాలర్ ఎగరేస్తున్నారు. వారిపై ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో చెప్పవలసిందిగా తమరిద్వారా గౌరవ మంత్రిగారిని నేను కోరుతున్నాను.

శ్రీ కె.ఇ. కృష్ణమూర్తి: అధ్యక్షా, అసైన్డ్ భూములను ఎకరాకు రూ. 1.75 లక్షల ప్రకారం తీసుకోవడం జరిగింది. అదేవిధంగా, ప్రభుత్వభూమి కూడా ఎకరాకు రూ. 50 వేల చొప్పున తీసుకోవడం జరిగింది. లేపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం 8,840 ఎకరాల భూమిని సేకరించడం జరిగింది. లేపాక్షి నాలెడ్జ్ హబ్‌పై మీకేదైనా నాలెడ్జ్ ఉన్నదా చెప్పమని ఇంతకుముందే మన ప్రతిపక్షనాయకులు కూడా అడిగారు. ఆయన చెప్పేది ఏమిటంటే, హబ్ అనేది ఒక సమూహం, సైన్స్ అండ్ టెక్నాలజీ పార్కు, మెడికల్ పార్కు, అగ్రోఫుడ్ పార్కు లేదా గ్రీన్‌పార్కు వంటివన్నీ పెట్టడానికి ఆభూమి సేకరించబడింది. కానీ, ఆ సేకరించిన భూమి దుర్వినియోగం అయింది. దీనికోసం నియమించిన కమిటీ ఈ విషయాలపై పరిశీలన చేస్తుంది. ఆ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత పేదల నుంచి తీసుకున్న భూమిని ఏ విధంగా వాపసు చేయాలి, ఆ భూమిపై తీసుకున్న లోను ఏవిధంగా రాబట్టాలనే విషయాలను తప్పనిసరిగా పరిశీలిస్తాము.

## సభా కార్యక్రమం

## ప్యానెల్ ఛైర్మన్ల నియామకంపై ప్రకటన

ఉ.11.40

MR. CHAIRMAN:

ANNOUNCEMENT

I am to announce to the House that I have nominated the following Members to be on the panel of Vice-Chairmen for the XXII-Session:

1. Smt. Pamidi Samanthakamani
2. Sri Vakati Narayana Reddy
3. Sri Boddu Nageswara Rao
4. Sri Mettu Govinda Reddy

Now, the House is adjourned to meet again at 10.00 A.M. tomorrow i.e. 19th. After this BAC meeting would be convened.

(Then the House adjourned at 11.41 a.m. to meet again on 19.12.2014 at 10.00 A.M)